సామూహిక నిరాహార దీక్షలో మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ

దత్తత గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి

- ఎంపి డాక్టర్ సంజీవ్ కుమార్, కలెక్టర్ డాక్టర్ సృజన
- సంసద్ ఆదర్శయోజగ పథకంపై సమీక్ష

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

సంసద్ ఆదర్శ గ్రామీణ యోజన (ఎస్‌ఎజివై) పథకం కింద దత్తత తీసుకున్న ఐదు గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని కర్నూలు ఎంపి డాక్టర్ సంజీవ్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఎంపి డాక్టర్ సంజీవ్ కుమార్ ఆధ్వర్యంలో సంసద్ ఆదర్శ్ గ్రామ యోజన పథకం కింద జరుగుతున్న పురోగతి పనులపై జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజనతో కలిసి సంబంధిత అధికారులతో జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఎంపి మాట్లాడుతూ 2014 అక్టోబర్ 11న భారత ప్రధాని నరేంద్ర మోడీ సంసద్ ఆదర్శ గ్రామీణ యోజన కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా ఈ పథకం అమలవుతోందని ఎంపీ పేర్కొన్నారు. జనాభాలో 60 నుంచి 70 శాతం గ్రామీణ ప్రాంతాల్లోనే నివసిస్తున్న నేపథ్యంలో గ్రామాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గంలో 472 గ్రామాలు ఉన్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలన్ని దత్తత తీసుకున్న ఐదు గ్రామాల్లో అమలు చేసి మౌలిక వసతులు కల్పించాలన్నారు. మిగిలిన గ్రామాలు కూడా వాటిని స్ఫూర్తిగా తీసుకొని అభివద్ధి చెందాలన్నది ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ ఐదు గ్రామాలలో చేయాల్సిన పనులకు సంబంధించి నివేదికను తయారు చేశామని, అందుకు సంబంధించిన పనులను ఐదు నెలల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

మాట్లాడుతున్న ఎంపి డాక్టర్ సంజీవ్ కుమార్, చిత్రంలో కలెక్టర్ డాక్టర్ సృజన

జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన మాట్లాడుతూ సంసద్ ఆదర్శ్ గ్రామ యోజన పథకాన్ని మన ప్రధానమంత్రి ప్రారంభించారన్నారు. ఈ పథకంలో ఎంపికఅయిన గ్రామాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలను సమర్థవంతంగా అమలు చేసి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడం ద్వారా ఇతర గ్రామాలు కూడా స్ఫూర్తి పొందుతాయన్నారు. వ్యక్తిగతంగా, సామాజికంగా పూర్తిస్థాయిలో ఈ గ్రామాలు అభివృద్ధి చెందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. చార్జ్ ఆఫీసర్లు క్రమం తప్పకుండా ఈ గ్రామాలను సందర్శించి, అభివద్ధికి కృషి చేయాలని సూచించారు. సన్సద్ ఆదర్శ్ గ్రామ యోజన కింద ఎంపికైన గ్రామాల్లో పనుల పురోగతి అంతగా సంతృప్తి ఇవ్వడం లేదని, వచ్చే సమావేశం నాటికి పూర్తిస్థాయిలో పురోగతి కనిపించేలా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా పరిషత్ సిఇఒ నాసరరెడ్డి మాట్లాడుతూ సంసద్ ఆదర్శ గ్రామీణ యోజన కార్యక్రమం కింద ఎమ్మిగనూరు మండలం దైవందిన్నె, తుగ్గలి మండలం రాతన , ఆస్పరి మండలం యాటకల్లు, పెద్దకడబూరు మండలం దొడ్డిమేకల, కర్నూలు మండలం నిడ్జూరు గ్రామాలను ఎంపిక చేశామని తెలిపారు. ఈ గ్రామాల్లో ఇప్పటివరకు 104 అభివృద్ధి పనులు మంజూరు కాగా, ఇందులో 74 పనులు పూర్తయ్యాయన్నారు. 30 పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. ఈ గ్రామాల్లో మరికొన్ని పనులు మంజూరు అయ్యాయని, వీటిని విలేజ్ డెవలప్మెంట్ ప్లాన్‌లో పొందుపరచాలన్నారు. గ్రామాలలో వివిధ శాఖల ద్వారా చేయవలసిన పనుల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆయన వివరించారు. కార్యక్రమంలో ఆయా శాఖల జిల్లా అధికారులు, పంచాయతి సెక్రటరీలు పాల్గొన్నారు.

నన్నూరు హైవేపై పుట్ వే బ్రిడ్జి పనులు ఆపాలి

- ప్రజా సంఘాలు, విద్యార్థులు, ప్రజల సామూహిక దీక్షలు
- ప్రారంభించిన ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఓర్వకల్లు మండలం నన్నూరు వద్ద జాతీయ రహదారిపై నిర్మించే పుట్‌వే బ్రిడ్జి నిర్మాణ పనులు నిలిపివేసి ఫ్లై ఓవర్ బ్రిడ్జి లేదా అండర్ బ్రిడ్జి నిర్మించాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం నన్నూరు బంగ్లా దగ్గర ప్రజా సంఘాలు, విద్యార్థులు, ప్రజలు సామూహిక నిరాహార దీక్షలు రైతు సంఘం మండల సహాయ కార్యదర్శి మధుసూదన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ దీక్షలను జి.రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా జి.రామకృష్ణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న, సిఐటియు మండల అధ్యక్షులు జి.శ్రీధర్ మాట్లాడారు. జాతీయ రహదారి పైన ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని గత అనేక సంవత్సరాలుగా కోరుతున్నా ఇంతవరకు ఎటువంటి చర్యలు చేపట్టలేదని అన్నారు. ఈ రహదారి పైన జరిగిన వివిధ సంఘటనలో అనేక మంది గ్రామస్తులు ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారని అన్నారు. ఈ గ్రామాన్ని ఆనుకొని లొద్దిపల్లె మీదిఎ ేముల, బైరాపురం, ఉయ్యాలవాడ ఉప్పలపాడు కలుగొట్ల బుక్కాపురం గ్రామాల ప్రజలు నిరంతరం మండల కేంద్రానికి, జిల్లా కేంద్రానికి పనుల నిమిత్తం వేలాదిమంది వెళుతుంటారని అన్నారు. వీరందరూ తమ గ్రామాలకు తిరిగి వచ్చేదాకా ప్రాణాలను అరిచేతిలో పెట్టుకుని రోడ్డు దాటాల్సి ఉందని తెలిపారు. ఎందుకంటే ఏ వాహనం ఎటునుంచి వచ్చి ఢీకొడుతుందో తెలియని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. నన్నూరు గ్రామ విద్యార్థులు వందలాదిమంది హైస్కూలు రహదారి అవతల వైపు ఉండడంతో రోడ్డు దాటుతూ వస్తూ ఉండాలి వీరి తల్లిదండ్రులు విద్యార్థులు బడి అయిపోయి ఇంటికి వచ్చేదాకా ఆందోళనతో ఉండే పరిస్థితి ఉంటుందని అన్నారు. గతంలో హైవే అథారిటీ, మండల తహశీల్దార్, కలెక్టర్,ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లామన్నారు. అయినా ఇప్పటివరకు ఎటువంటి స్పందన లేదన్నారు. 10 రోజుల నుండి ఫుట్‌వే బ్రిడ్జి నిర్మాణ పనులను చేస్తున్నారన్నారు. కలెక్టర్, ఎంపీ స్పందించి వెంటనే ఫుట్‌వే బ్రిడ్జి పనులు నిలిపివేయక పోతే ఈనెల 20న పెద్ద ఎత్తున గ్రామ ప్రజలందరితో కలిపి నేషనల్ హైవేను దిబ్బంధనం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నన్నూరు గ్రామ ప్రజలు మాసుంబాష, ఆంజనేయులు, బషీర్, సలాం రాజేష్, బొజ్జన్న, సంజీవలక్ష్మన్న, వెంకటేశ్వర్లు, మధు, శివరాముడు, జగన్నాథం, రాముడు, రోషన్న , స్వాములు, ప్రజాసంఘాల నాయకులు వెంకటేశ్వర్లు రంగస్వామి సిద్దయ్య బుగ్గ రాముడు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మామిదాలపాడు మరుగుదొడ్లకు మోక్షమెప్పుడు?

ప్రారంభించినా వినియోగంలోకి రాని వైనం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలునగరంలో విలీనమైన మామిదాలపాడు గ్రామంలో టిడిపి ప్రభుత్వంలో మొదలుపెట్టిన మహిళల మరుగుదొడ్లు పూర్తయ్యాక వైసిపి ప్రభుత్వంలో కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ ఏడాది క్రితం ప్రారంభించారు. నిర్వహణ బాధ్యతలు ఎవరికీ అప్పజెప్పకపోవడంతో మరుగుదొడ్లు నీటి వసతి ఉన్నప్పటికీ వినియోగంలోకి రాలేదు. వాటి నిర్మాణానికి సుమారు రూ.20 లక్షలు ఖర్చు చేశారు. మామిడాలపాడు మహిళలు బహిర్భూమికి వెళ్లాలంటే పగలు కంపచెట్ల దాపుకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. రాత్రిపూట బహిర్భూమికి వెళ్లాలంటే పాముల భయం ఉంది. వినియోగించక పోవడంతో మరుగుదొడ్ల ప్రదేశంలో ఎద్దులను కట్టేస్తున్నారు. నగరపాలక సంస్థ కమిషనర్, అధికారులు వెంటనే స్పందించి ఆ మరుగుదొడ్లను సందర్శించి నిర్వహణ బాధ్యతలు ఎవరికో ఒకరికి అప్పగించి వినియోగంలోకి తీసుకురావాలని మహిళలు కోరారు.

మహిళలకు మాత్రమే కేటాయించాలి : శాంతమ్మ

మామిదాలపాడు ప్రాంతంలో 1991 నుండి ఇక్కడ ఇల్లు నిర్మించుకుని జీవనం చేస్తున్నాం. మా పిల్లలు పెద్దగయి పెళ్లిళ్ల కూడా చేశాం. కానీ ఇంతవరకు మరుగుదొడ్లు నిర్మించిన వినియోగించుకోలేని పరిస్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మరుగుదొడ్లు స్త్రీలకు, పురుషులకు కాకుండా స్త్రీలకు మాత్రమే కేటాయించాలని కోరారు. పురుషుల కేటాయిస్తే సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందన్నారు.

మరుగుదొడ్ల నిర్వహణ బాధ్యతలు తీసుకుంటాం

నాగేశ్వరమ్మ, ప్రభావతి

మరుగుదొడ్ల నిర్వహణ బాధ్యతను తమకు ఇచ్చినట్లయితే మంచిగా చూసుకుంటామని మామిడాలపాడు కు చెందిన ఆ ప్రాంతపు నాగేశ్వరమ్మ ప్రభావతి తెలిపారు. పరిసరాలను శుభ్రం చేసి మరుగుదొడ్ల వరకు సిసి రోడ్డు వేయాలనికోరారు.

ఎపి ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ ప్రధాన కార్యాలయానికి భూమి పూజ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యూలేటరీ కమిషన్ ప్రధాన కార్యాలయ భవన నిర్మాణానికి ఇఆర్‌సి చైర్మన్ జస్టిస్ సివి. నాగార్జున రెడ్డి శుక్రవారం భూమి పూజ చేశారు. నగర శివారులోని ఎపి కార్బైట్ ఫ్యాటరీ వద్ద ఉన్న ట్రాన్స్‌కో 220కెవి విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణంలో నిర్మించనున్న పనులను ఆయన ప్రారంభించారు. రెండు ఎకరాల్లో చేపడుతున్న ఈ పనులు ఏడాదిలోపు నాణ్యతతో పూర్తి చేయనున్నామన్నారు. 2014లో రాష్ట్ర విభజన జరిగినా.. ఇప్పటి వరకు ఇఆర్‌సి కార్యాలయం హైదరాబాదులోనే ఉందన్నారు. ఈ కార్యాలయాన్ని కర్నూలులో ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం గత ఏప్రిల్ 25న ఒఒ.ఎంఎస్ నంబర్-8ని విడుదల చేసిందన్నారు. దీంతో ట్రాన్స్కో సబ్ స్టేషన్లోని ఆవరణంలో పక్కా భవనాన్ని నిర్మించేందుకు స్థలాన్ని ఎంపిక చేసి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. అతిథిగా లోకాయుక్త చైర్మన్ జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి హాజరయ్యారు. ఇఆర్‌సి మెంబర్ సెక్రటరీ రాజబాపయ్య, టెక్నికల్ మెంబర్ కూకూర్ రాంసింగ్, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోషరావు, ట్రాన్స్‌కో డైరెక్టర్ ఎకెవి భాస్కర్, ఎపిఎస్‌పిడిసిఎల్ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఇ ఎం. ఉమాపతి, ట్రాన్స్‌కో ఎస్ఇ కృష్ణకుమార్, సివిల్ ఎస్ఇ భాస్కర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎపి ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ ప్రధాన కార్యాలయం భూమి పూజ చేస్తున్న చైర్మన్ జస్ట్ సివి నాగార్జున రెడ్డి, లోకాయుక్త చైర్మన్ జస్టిస్ పి.లక్ష్మణ రెడ్డి, ఎఆర్‌సి సభ్యులు, ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి సంతోష రావు

రికార్డులను జాగ్రత్తగా భద్రపరచాలి

- ఆర్‌డిఒ కార్యాలయాన్ని ప్రారంభించిన కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ :

విలువైన రెవెన్యూ రికార్డులను అధికారులు జాగ్రత్తగా భద్రపరచుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి సృజన అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరంలో ఆధునీకరించిన కర్నూలు ఆర్‌డిఒ కార్యా లయాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, మున్సిపల్ కమిషనర్ భార్గవ్ తేజతో కలిసి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆర్‌డిఒ కార్యాలయాన్ని చక్కగా ఆధునికరించారని చాలా బాగుందని సంతోషం వ్యక్తం చేశారు. నూతనంగా నిర్మించిన కార్యాలయం గదులను పరిశీలించారు, రికార్డు రూములను పరిశీలి ంచి రికార్డులను క్రమబద్ధంగా ఉంచినందుకు సంతృప్తి వ్యక్తం చేశారు. రెవిన్యూ రికార్డులు చాలా విలువైనవని, వాటిని భద్రంగా ఉంచుకోవడం మన బాధ్యత అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో రెవెన్యూ శాఖది కీలకపాత్ర అని, ఆ దిశగా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయం పక్కనే ఉన్న పాత ఎంప్లాయిమెంట్ ఆఫీస్ భవనాన్ని పరిశీలించి ఈ భవనాన్ని కూడా ఆధునికరించి మీటింగ్ హాలు ఏర్పాటు కు ప్రతిపాదనలు తయారుచేసి పంపాలని ఆర్‌డిఒను, ఆర్ అండ్ బి ఇఇ ని ఆదేశించారు.

కర్నూలు ఆర్‌డిఒ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన , జెసి ఎన్.మౌర్య, తదితరులు

నగరాన్ని సుందరంగా తీర్చి దిద్దాలి

నగరాన్ని సుందరంగా తీర్చి దిద్దాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.. కర్నూలు నగరం సుందరీకరణ కార్యక్రమంలో భాగంగా కొండారెడ్డి బురుజు ప్రాంతంలో చేపడుతున్న ప్లాజా పనులను కలెక్టర్ పరిశీలించారు. కర్నూలు నగర కమిషనర్ భార్గవ తేజ సుందరీకరణకు సంబంధించి కొండా రెడ్డి బురుజు ప్రాంతంలోని చేపడుతున్న పనులను గురించి, అక్కడ నిర్మిస్తున్న ప్లాజా పనుల మ్యాప్‌ను చూపించి కలెక్టర్‌కు వివరించారు. సుందరీకరణ పనులు బాగా చేయాలని, పర్యాటకులను ఆకట్టుకునే విధంగా ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ సూచించారు. డిఆర్‌ఒ నాగేశ్వరరావు, ఆర్‌డిఒ హరి ప్రసాద్, ల్యాండ్ సర్వే ఎడి రామ్మోహన్, దిశా డిఎస్‌పి సుధా కర్ రెడ్డి, మండలాల తహశీల్దార్లు, డిప్యూటీ తహశీ ల్దార్లు, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

ఎన్‌ఎల్‌సి సమావేశానికి హాజరయిన ఎమ్మెల్యేలు హాఫీజ్‌ఖాన్, ఆర్థర్, చక్రపాణిరెడ్డి

ఎన్‌ఎల్‌సి సమావేశంలో జిల్లా ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ముంబై లో జరుగుతున్న జాతీయ శాసనసభ్యుల సదస్సుకు హాజరయిన మాజీ లోకసభ స్పీకర్స్ సుమిత్ర మహజన్, మీరాకుమారిని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు శుక్రవారం కలిశారు. కర్నూలు ఎమ్మెల్యేలు హాఫీజ్ ఖాన్, కాటసానిరాంభూపాల్ రెడ్డి, ఆర్థర్, శిల్ప చక్రపాణి రెడ్డి, తెనాలి ఎమ్మెల్యే శివకుమార్, ఎమ్మెల్సీ మాధవ్ రావు తదితరులు పాల్గొన్నారు.

దళితుల ఇంటి నిర్మాణాలను కూల్చిన వారిని శిక్షించాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి-పత్తికొండ

దళితుల ఇంటి నిర్మాణాలను కూల్చివేసిన డిప్యూటీ తహశీల్దార్ విష్ణు ప్రసాద్ పై చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి గిత్తరి రమేష్, సురేంద్ర డిమాండ్ చేశారు. శుక్రవారం పత్తికొండ ఈశ్వర్ రెడ్డి భవనం నుంచి కెవిపిఎస్ ఆధ్వర్యంలో దళితులు ప్రదర్శనగా వెళ్లి ఆర్‌డిఒ కార్యాలయం దగ్గర ధర్నా చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా సహాయ కార్యదర్శి గిత్తరి రమేష్ మాట్లాడుతూ పత్తికొండ పట్టణంలోని సర్వేనెంబర్ 95లో ఇల్లు లేని నిరుపేద దళితులు ఇంటి నిర్మాణాలు చేపడుతుంటే రెవెన్యూ అధికారులు కూల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని అన్నారు. రెవెన్యూ అధికారులు దళితులకు అండగా ఉండాల్సింది పోయి దళితులు ఇండ్లను కూల్చివేయడం చాలా సిగ్గుచేటని అన్నారు. కూల్చివేసిన రెవెన్యూ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ తరఫున డిమాండ్ చేశారు. కెవిపిఎస్ నాయకులు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని పత్తికొండ ఆర్‌డిఒ మోహన్‌దాస్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంజనమ్మ, రంగమ్మ, పెద్దక్క, లక్ష్మి, హనుమంతమ్మ, రాఘవేంద్రమ్మ, హుల్తేన్న, ఈరప్ప, ఓలెప్ప, సుంకన్న, రాముడు, నెట్టకంటయ్య, రంగస్వామి, సంజన్న ,సురేష్ పులికొండ, సురేంద్ర , ఆనందు , మల్లేశం పులికొండ పాల్గొన్నారు

ఆర్‌డిఒకు వినతిపత్రం ఇస్తున్న కెవిపిఎస్ నాయకులు

విఆర్‌ఎలకు పేస్కేల్ అమలు చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విఆర్‌ఎలకు పే స్కేల్ అమలు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి.అంజి బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా పరిషత్ నుండి కార్మిక కర్షక భవన్ వరుకు విఆర్‌ఎల సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్మికకర్షక భవన్‌లో విఆర్‌ఎల పే స్కేల్ పై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు కర్నూల్ డివిజన్ నాయకులు ధనుజయ అధ్యక్షత వహించారు. ఈ సదస్సును ఉద్దేశించి విఆర్‌ఎల సంఘం కర్నూలు జిల్లా అధ్యక్షుడు అంజి, కార్యదర్శి శ్రీనివాసులు, సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పిఎస్. రాధాకృష్ణ, అంజి బాబు మాట్లాడారు. సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు తను పాదయాత్ర చేస్తున్న సందర్భంలో మీకు నేనున్నాను, నేను విన్నాను ,మన ప్రభుత్వం వచ్చిన వారంలోపే గ్రామ సేవకులకు పేస్కేలు, నామినీలను రెగ్యులర్ చేస్తాను, ప్రమోషన్లు కల్పిస్తామని, వారసత్వం కొనసాగిస్తామని హామీ ఇచ్చారన్నారు. ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లవుతున్నా విఆర్‌ఎల సమస్యలు ఒకటి కూడా పరిష్కరించక పోగా ఉన్న జీవోలోనే కోత పెడుతూ విఆర్‌ఎల నుండి ఒక్క విఆర్‌ఏతో రూ.19,500 రికవరీ చేసుకోవడం, జీతాలు పెంచక విఆర్‌ఎలు అప్పులలో కూరకుపోయారన్నారు. నామినీగా ఎన్నో సంవత్సరాల నుండి పనిచేస్తున్న రెగ్యులర్ కాకపోవడం, ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయక విద్యా అర్హత ఉండి కూడా ప్రమోషన్ లేక అయోమయం పరిస్థితిలో విఆర్‌ఎలు ఉన్నారన్నారు. తెలంగాణ ప్రభుత్వం గ్రామ సేవకులకు పే స్కేలు, 55 సంవత్సరాలు పైబడిన వారికి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ,ప్రమోషన్లు కల్పిస్తూ విఆర్‌ఎల జీవితాల్లో వెలుగు నింపారన్నారు. తెలంగాణ ప్రభుత్వం కన్నా మిన్నగా చేస్తామని చెప్పిన జగన్మోహన్ రెడ్డి తక్షణమే న్యాయం చేయలన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే పోరాటానికి వెళ్తామని హెచ్చరించారన్నారు. ఈ సదస్సులో అయ్యాస్వామి, ధనుంజయ, శ్రీను, మహేశ్వరి, కొండన్న , శేఖర్, మధు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు

కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ వర్కర్లందర్నీ రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరపాలక సంస్థలో హెల్త్ , ఇంజనీరింగ్ సెక్షన్లలో వివిధ కేటగిరీలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ వర్కర్లందరినీ రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని వైఎస్‌ఆర్‌టియుసి జిల్లా అధ్యక్షులు వైవి.రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఎపిసిఒఎస్‌లు స్కంద కాంప్లెక్స్ వైఎస్‌ఆర్‌టియు యూనియన్ కార్యాలయం నుండి యూనియన్ అధ్యక్షులు వైవి రమణ ఆధ్వర్యంలో రాజ్‌విహార్ మీదుగా కర్నూలు నగరపాలక సంస్థ కార్యాలయం వరకు ప్రదర్శన చేశారు. సిఎం జిందాబాద్, జై జగన్, జగన్ నాయకత్వం వర్ధిల్లాలి కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ వర్కర్లను రెగ్యులర్ చేయాలి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి. కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. వైవి రమణ, నాయకులు ఏ స్వాములు, ఎంవి నారాయణలు మాట్లాడుతూ కరోనా మహమ్మారి సందర్భంలో మరణాన్ని ఎదుట ఉంచుకొని ప్రజారోగ్య సంరక్షణలో భాగంగా పరిశుభ్రతకు ప్రాముఖ్యతనిస్తూ ప్రాణాలు ఫణంగా పెట్టి కార్మికులు విధులను నిర్వహించారన్నారు. సిఎం జగన్మోహన్ రెడ్డి వారి పని విధానానికి ఎంత ఇచ్చినా, ఎంత చేసినా తక్కువేనని అన్నారన్నారు. జగన్మోహన్ రెడ్డి కార్మికుల సంక్షేమంకోసం ఎంతో చేశారని, నగరపాలక సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు రెగ్యులర్ చేస్తారని తమ పూర్తిగా నమ్మకం ఉందన్నారు. సమాన పనికి సమాన వేతనము ఇప్పించాలని కోరుతున్నామన్నారు. ఇంజనీరింగ్ సెక్షన్ ఆఫ్ కోర్స్ వర్కర్స్ కు 2019 సంవత్సరం ఆగస్టు నుంచి ఆరోగ్య అలవెన్సులు ఇవ్వాలని, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్లలో వివిధ కేటగిరీలలో విధులను నిర్వహిస్తున్న వర్కర్స్ అందరికీ రెగ్యులర్ చేయాలని, గ్రాట్యుటీ లాంటి బెనిఫిట్స్ కూడా లేకుండా పదవి విరమణ చేసి ఒట్టి చేతులతో ఇంటికి పోయే వారి జీవనోపాధి ఎలా అని ఆలోచించాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఎంవి. నారాయణ, సాములు, చిన్నయ్య, బీసన్న, చౌడయ్య, సుబ్బయ్య, మధు, శాంతమ్మ, పద్మ, రేణుక, మహేశ్వరి ,నానమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న వైవి.రమణ

ఒలంపిక్ క్రీడా సంబరాలలో క్రీడాకారులతో డాక్టర్ శంకర్‌శర్మ

ఒలంపిక్ క్రీడా సంబరాలు ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలుస్పోర్ట్స్

ఒలంపిక్‌డే సందర్భంగా నిర్వహిస్తున్న క్రీడా పోటీలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ కర్నూలు ఒలంపిక్ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలను ఈనెల 16 నుండి 20 వరకు సుమారు 20 క్రీడాంశాలలో పోటీలను నిర్వహిస్తున్నట్లు ఒలంపిక్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. అందులో భాగంగా శుక్రవారం సిల్వర్‌జూబ్లీ కళాశాలలో బాస్కెట్ బాల్ పోటీలను ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ క్రీడాకాలను పరిచయం చేసుకుని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేహదారుఢ్యానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని ప్రతి క్రీడాకారుడు ఏదో క్రీడలో సాధన చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆయన ఉద్భోదించారు క్రీడల అభివృద్ధికి తన సహకారం ఎల్లవేళలా ఉంటుందని ఆయన తెలిపారు. క్రీడల్లో పథకాలు సాధించే వారికి మంచి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాసులు సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు రైతులకూ ఉపయోగపడాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-సి బెళగల్

ఉపాధి పనులు రైతులకు ఉపయోగకరంగా ఉండాలని ఎంపిడిఒ రాముడు ఉపాధి సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందితో సమీక్షించి మాట్లాడారు. 100 రోజుల పని దినాలపై గ్రామాల్లో అవగాహన విస్తృతం చేయాలని పేర్కొన్నారు. కొలతల ప్రకారం బిల్లులు వేయాలని ఎవరైనా అక్రమాలకు పాల్పడితే తగు చర్యలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ లక్ష్మన్, ఇసి పద్మ రాజ్, ఎఫ్ఎలు, టిఎలు, మేటీలు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డికి వినతి పత్రం ఇచ్చిన నాయకులు

మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు

కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలి

ప్రజాశక్తి - ఆదోని

మున్సిపల్ ఇంజనీరింగ్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి ఈరన్న, బి రామాంజనేయులు, పట్టణ కార్యదర్శి పిఎస్ గోపాల్, సహాయ కార్యదర్శి లక్ష్మన్న డిమాండ్ చేశారు. ఆదోని మున్సిపల్ కార్యాలయ ఆవరణంలోని శుక్రవారం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయు) ఆధ్వర్యంలో కమిషనర్ రఘునాథ్ రెడ్డికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, పనిముట్లు, డ్రస్సులు అందజేయాలన్నారు. రక్షణ సామాగ్రిని ఇవ్వాలని, కాంట్రాక్టు కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, ప్రమాదవశాత్తు మరణిస్తే కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దశాబ్ద కాలంగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారన్నారు. ఎన్నికల సందర్భంగా కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేస్తామని అధికారంలోకి వచ్చిన సీఎం జగన్మోహన్ రెడ్డి సీఎం కాగానే మాట మార్చడం సమంజసం కాదన్నారు. ఈ కార్యక్రమంలో రామాంజనేయులు, సోమన్న, కర్రెప్ప, హనుమంతు, ఈరన్న, ముని, బాష, అహ్మద్ ఉద్యోగులు వున్నారు.

ముందుకు సాగని ముంగారి

- తగ్గని ఎండ తీవ్రత
- ఎదగని పైర్లు... పత్తిని తొలగిస్తున్న రైతులు

ప్రజాశక్తి - హోళగుంద

ఈఏడాది ముంగారి పంటలు ముందుకు సాగడం లేదు. జూన్ నెల 15 దాటినా ఎండ తీవ్రత తగ్గకపోవడంతో చిన్నగా ఉన్న పత్తి పంటలు ఎదుగుదల లేక ఎండిపోతున్నాయి. చేసేదేమీ లేక కొంతమంది రైతులు పంటలను మేకలకు, పశువులకు వదిలేస్తున్నారు. మరి కొంతమంది రైతులు గుంటికతో పూర్తిగా తొలగిస్తున్నారు. మే నెల 15 నుంచి ఇప్పటివరకు రెండు వర్షాలు కురిశాయి. పదును చేసుకున్న పొలాల్లో పత్తి పంట వేసుకుంటే గులాబీ రంగు పురుగు బెడద ఉండదని రైతులు పత్తి విత్తనాలు వేసుకొని సంబరాల్లో మునిగిపోయారు. గత 15 రోజులుగా మండలంలో మంచి వర్షాలు కురువకపోగా ఎండలు దంచి కొడుతున్నాయి. ఎదుగుదల లేకపోవడంతో పంటలను తొలగించినట్లు రైతులు పేర్కొంటున్నారు.

ఈ ఏడాది వర్ష ప్రభావం తక్కువ

ఈ ఏడాది వర్షాలు తక్కువ కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు

పంటను జీవాలు మేస్తున్న దృశ్యం

పేర్కొంటున్నట్లు సమాచారం. ఎల్‌నినో ప్రభావం వల్ల సాధారణ వర్షపాతం కంటే ఈఏడాది వర్షాలు తక్కువ కురుస్తాయని తెలిసింది. ప్రతి మూడేళ్లకోసారి వాతావరణంలో మార్పులు జరుగుతాయని, గడిచిన మూడేళ్లలో వర్షపాతం నమోదు కాలేదు. గతేడాది గమనిస్తే లానినో ప్రభావంతో అత్యధిక వర్షాలు కురిశాయి. వాగులు, వంకలు, డ్యాంలు, రిజర్వాయర్లు నిండుకుండల్లా ఉన్నాయి. గతంలో ఎల్‌నినో ప్రభావం ఆఫ్రికా, ఆస్ట్రేలియా యూరప్ వంటి దేశాల మధ్య ఉండగా ఆ ప్రభావం మనకు కనిపిస్తున్నట్లు తెలిసింది.

అతివృష్టి, అనావృష్టి

గడిచిన మూడేళ్లలో అతివృష్టి కారణంగా చేతికొచ్చిన పంటలు నీటి పాలయ్యాయి. ఈఏడాది అనావృష్టి కారణంగా వర్షాలు కురవక, పంటలు సరిగా పండక అన్నదాతలు నష్టాన్ని చవిచూడాల్సిన పరిస్థితి వస్తుందని పలువురు మేధావులు అభిప్రాయ పడుతున్నారు. ఈ ఏడాది జూన్‌లోనే పంటలను పశువులకు, మేకలకు వదిలేసిన పరిస్థితి ఇందుకు నిదర్శనం. మరి కొంతమంది రైతులు పొలంలో ఎండిపోతున్న పంటలను దున్నేశారు.

ఈఏడాది వలసలు తప్పవా..?

ఈఏడాది కూడా బెంగళూరు, ముంబయి, హైదరాబాద్ వంటి సుదూర ప్రాంతాలకు వలస వెళ్లక తప్పదా అని రైతులు దిగులు చెందుతున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.10 వేల చొప్పున ఖర్చు చేసి పొలాలను పదును చేసుకుని విత్తనాలను కూడా సిద్ధం చేసుకుని కొంతమంది రైతులు వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. మరి కొంత మంది రైతులు పత్తి పంటను పొలంలో వేసి తీవ్రంగా నష్టపోయారు. వర్షాలు అరకొరగా కురిస్తే మూటాముల్లె సర్దుకొని పిల్లాపాపలతో వలసబాట పట్టక తప్పదా అని ఆందోళన చెందుతున్నారు.

వైసిపిలోకి కప్పట్రాళ్ల బొజ్జమ్మ దంపతులు

- ఈనెల 19వ తేదీన చేరిక

ప్రజాశక్తి - దేవనకొండ

కర్నూలు జిల్లాలో కరువు ప్రాంతంగా అత్యంత వెనుకబడిన ఆలూరు నియోజకవర్గంలో రాజకీయ సమీకరణలు మారనున్నాయి. ఆలూరు నియోజకవర్గంలో అత్యధికంగా వాల్మీకి ఓటర్లు ఎక్కువగా ఉడడంతో గెలుపోటముల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ కోవకే చెందిన రాష్ట్ర ఉపాధి కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన సంగతి తెలిసిందే. ఏళ్ల నుండి టిడిపిలో ఉంటూ పార్టీ కొరకు అహర్నిశలు కృషి చేస్తున్నప్పటికీ టిడిపి అధిష్టానం తగు గుర్తింపు ఇవ్వకపోవడంతో విసుగు చెంది కప్పట్రాళ్ల దంపతులు వైసిపి గూటికి చేరనున్నట్లు సమాచారం. ఈనెల 19వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సమక్షంలో వైసిపి తీర్థం పుచ్చుకోనున్నారు. గత కొంతకాలంగా ఆలూరు నియోజకవర్గం టిడిపి ఇంచార్జి కోట్ల సుజాతమ్మతో విభేదాలు ఉన్నప్పటికీ అధినాయకత్వం అండ ఉంటుందన్న ఆశతో పార్టీలో కొనసాగారు. టిడిపి అధ్యక్షులు చంద్రబాబు నాయుడును కలసి తమకు సముచిత స్థానం కల్పించాలని కోరినప్పటికీ సరైన సమాధానం రాకపోవడంతో టిడిపిని వీడనున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. 2019 ఎన్నికల సమయంలోనూ టిడిపి అధిష్టానం కోట్ల సుజాతమ్మకు ఆలూరు టికెట్ ఇవ్వడంతో తన తండ్రి వెంకటప్ప నాయుడును హత్యచేయడంలో కోట్ల కుటుంబం అండదండలు అందించారని దీంతో పరోక్షంగా వైసీపీ అభ్యర్థి గుమ్మనూరు జయరాంకు ఆ ఎన్నికల్లో సహకరించి గెలుపునకు కృషి చేసిన్నట్లు అప్పటల్లో పలువురు భావించారు. అయితే వైసిపి అధికారంలోకి వచ్చి గుమ్మనూరు జయరాం మంత్రి అయినప్పటికీ ప్రత్యర్థులు మద్దిలేటి నాయుడు వర్గం మంత్రి దగ్గర ఉండడంతో అక్కడ ఇమడలేక టిడిపిలోనే కొనసాగారు. స్వర్గీయ కప్పట్రాళ్ల వెంకటప్ప నాయుడు దేవనకొండ మండలాన్ని టిడిపికి కంచుకోటగా మలచి ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు నియోజకవర్గాల ఎమ్మెల్యేల గెలుపునకు ముఖ్యపాత్ర పోషించినప్పటికీ టిడిపి అధిష్టానం మాత్రం న్యాయం చేయకపోవడంతో కరివేపాకుల వాడుకున్నాన్న ఆరోపణలు ఉన్నాయి.

ముఖ్యమంత్రి సన్నిహితుల ద్వారా చేరిక: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్య సన్నిహితులు జమ్మలమడుగు రామ సుబ్బారెడ్డి, అమర్నాథ్ రెడ్డి ల సహకారంతో వైసిపిలోకి చేరుతున్నారు. 2024 ఎన్నికల్లో వైసిపి అధికారంలోకి వస్తే తగిన ప్రాధాన్యత, పదవి ఇస్తారని తెలపడంతో ఈనెల 19వ తేదీన వైయస్ జగన్మోహన్ రెడ్డితో కలిసి పార్టీలో చేరనున్నారు.

బుజ్జగింపులు: ఆస్పరి మాజీ జెడ్పిటిసి కప్పట్రాళ్ల బొజ్జమ్మ, దేవనకొండ మాజీ ఎంపీపీ రామచంద్ర నాయుడు టిడిపిని వీడి వైసిపిలో చేరుతున్నట్లు సమాచారం తెలుసుకోవడంతో ఆలూరు టిడిపి మాజీ ఇంచార్జ్ వైకుంఠం మల్లికార్జునతో సంప్రదింపులు చేసినప్పటికీ విఫలమైన్నట్లు సమాచారం. టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్‌తో మాట్లాడి సముచిత న్యాయం కల్పించేలా మాట్లాడుతానని చెప్పినప్పటికీ తిరస్కరించినట్లు పలువురు అనుకుంటున్నారు.

విఓఎలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి - కౌతాళం

వివో ఏ ల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా నాయకులు

విఓఎలకు ఉద్యోగ భద్రత కల్పించాలని విఓఎ సంఘం జిల్లా అధ్యక్షులు బసవరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం బుడుముల దొడ్డి ఆంజనేయస్వామి కల్యాణ మండపంలో కౌతాళం మండలం ఏపీ వైకేపీ వివోఏల యూనియన్ సమావేశం మండల అధ్యక్షులు శివానంద అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా యూనియన్ జిల్లా అధ్యక్షులు సి. బసవరాజు పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతం లో ఉన్న నిరుపేద మహిళలు ఆర్థిక, సామాజిక పరంగా అభివృద్ధి పతం లో ఉండటానికి ప్రభుత్వం అందించే సంక్షేమ పతకాలను అందించుటలో వివో ఏ లు కీలక పాత్ర వహిస్తున్నారు.అన్నారు. నిరంతరం మహిళలకు అందుబాటులో ఉండి సర్ఫ్ నిర్వహించే ప్రతి పనిలో పాల్గొని విజయవంతం చేస్తున్నారని అన్నారు. అనేక ప్రభుత్వ కార్యక్రమాలు విజయవంతం చేస్తున్న కూడా తమకు ఉద్యోగ భద్రత లేదన్నారు. ఈ సమావేశం లో జిల్లా ఉపాధ్యక్షులు రవి కుమార్, జిల్లా కోశాధికారి పద్మావతి, జిల్లా ఈసీ మెంబెర్ మిన్నెల్లా మరియు మండల కార్యదర్శి రవికుమార్, కోశాధికారి మల్లెబ్రభ, గౌరవాధ్యక్షులు అబ్రహం, వివోఏలు మంతెషస్వామి, వీరేష్,యాంకప్ప, మహాదేవ, రామాంజి, దానియేలు పాల్గొన్నారు.

మాదిగ పేటపై దాడి అమానుషం

- కెవిపిఎస్, ఎంఆర్‌పిఎస్, మాల మహానాడు

ప్రజాశక్తి - నందవరం

మండలంలోని పొనకలదిన్నే గ్రామంలో గురువారం రాత్రి మాదిగ పేటపై గ్రామంలోని అగ్రకులాలు మూకుమ్మడిగా దాడికి పాల్పడి, విచక్షణ రహితంగా దాడి చేసి మాదిగలను గాయపరచడం అమానుషమని టిడిపి ఎస్‌సి సెల్ తాలుక అధ్యక్షుడు దావీదు, బాలరాజు, ఎంఆర్పిఎస్ రాష్ట్ర కార్యదర్శి జి. ఆనంద్, చైతన్య మాదిగ, కెవిపియస్ జిల్లా ఉపాధ్యక్షులు కనకవీడు రాజు, మాల మహానాడు (చెన్నయ్య వర్గం) జిల్లా గౌరవ అధ్యక్షులు గుడికల్ రాజోలప్పలు అన్నారు. శుక్రవారం అగ్రకులాల దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న పొనకలదిన్నె గ్రామ మాదిగ బాధితులను ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రి నందు పరామర్శించారు. సంఘటనలో జరిగిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దళిత ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నందవరం మండలం తహసిల్దార్ కార్యాల యం ఎదుట ఆందోళన నిందితులను కఠినంగా శిక్షించాలని రెవిన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత, బాబాసాహెబ్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటుకు ఏడాది క్రితమే గ్రామపంచాయతీ తీర్మానాన్ని ఆమోదించిందన్నారు. గ్రామపంచాయతీ తీర్మానం మేరకు కేటాయించిన స్థలంలో అంబేద్కర్ విగ్రహం నిర్మాణానికి మాదిగలు పునాది తవ్వితే సహించని గ్రామ పెత్తందారులు రోడ్డు నిర్మాణం పేరుతో తవ్విన గుంతను పూడ్చడమే కాకుండా గ్రామంలో విగ్రహం పెడతారా! మీరు దళితవాడలకే పరిమితం కావాలి అంటూ భయానకం వాతావరణం సృష్టించి, కులం పేరుతో దూషిస్తూ అధికార పార్టీకి చెందిన అగ్రకుల దురహంకారులు దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. దీనిని ప్రజాస్వామిక వాదులుతీవ్రంగా ఖండించాలన్నారు. ఆదోని డివిజన్‌లో దళితులపై దాడులు అధికమైనప్పటికీ నిలువరించడంలో పోలీస్ అధికారులు ఘోరంగా విఫలం చెందారని మండిపడ్డారు. దళితులపై జరిగిన సంఘటనను చూస్తుంటే కారంచేడు, చుండూరు, లక్ష్మింపేట సంఘటనలను తలపిస్తుందని ఆవేదన చెందారు. దాడులకు గురైన గ్రామాలను అట్రాసిటీ గ్రామాలుగా గుర్తించి జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలు సందర్శించి బాధితులకు అండగా నిలవాలని కోరారు. గ్రామాలలో పోలీస్ పీకేటింగ్ ఏర్పాటు చేసి దళితులకు భద్రత కల్పించి, దాడులకు పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి శిక్షించాలన్నారు. మాదిగలపై దాడులకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు హాలహర్వి గంధాలం ప్రభాకర్ మాదిగ, శావల చిన్న రంగన్న మాదిగ, కెవిపిఎస్ ఎమ్మిగనూరు పట్టణ ప్రధాన కార్యదర్శి సుమాల అంతోని, వెంకటాపురం గుంటేప్ప, మాల మహానాడు నాయకులు గుడికల్ లక్ష్మన్న , ఎమ్మార్పీఎస్ నాయకులు సలింద్ర మాదిగ, గంజహల్లి బాబు మాదిగ, కంబలదిన్నె ఆరోను మాదిగ, చంద్రశేఖర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న టీడీపీ ఎస్సి సెల్ నాయకులు దావీదు, బాలరాజు

పెద్దకడబూరు : నందవరం మండలంలో పోనకల దీన్నే గ్రామంలో మాదిగ పేటపై గ్రామంలో అగ్రకులాలు ముక్కుముడిగా దాడికి పాల్పడ్డ వారిని శిక్షించాలని కెవిపిఎస్ మండల కార్యదర్శి ఆనంద్ రాజు డిమాండ్ చేశారు. కులం పేరుతో దూషించడం హేమమైన చర్య అన్నారు. దాడిలో పాల్గొన్న వారిని వెంటనే శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డప్పు కళాకారు నాయకులు బసప్ప పాల్గొన్నారు.

శ్రీ మఠంలో స్వర్ణ రథోత్సవం

ప్రజాశక్తి - మంత్రాలయం

రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీ రాఘ వేంద్రస్వామి మఠంలో విజయీంద్ర తీర్థుల స్వర్ణ రథోత్సవం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం శ్రీ విజయీంద్ర తీర్థుల ఆరాధనను పురస్కరిం చుకుని ఆయన చిత్రపటాన్ని స్వర్ణ రథోత్సవంపై ఉంచి పూజారులు పుష్పార్చనతో మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం మేళ తాళాలు మంగళ వాయిద్యాలు నడుమ రథోత్స వాన్ని శ్రీ మఠం ప్రాకారంలో ఘనంగా ఊరేగించారు. అనంతరం ఊయల మండపంలో ఉంచి పండితులు ప్రవచనాల ద్వారా ఆయన చేసిన సేవలను కొనియాడారు.

శ్రీ విజయీంద్ర తీర్థుల బృందావనానికి విశేష పూజలు
- టిడిపి పట్టు వస్త్రాల సమర్పణ

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీ రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో శ్రీ విజయీంద్ర తీర్థుల బందావనానికి విశేష పూజలు నిర్వహించారు. శుక్రవారం తమిళనాడు రాష్ట్రంలోని కుంభకోణంలో శ్రీ విజయీంద్ర తీర్థ ఆరాధన మహోత్సవాలు ఘనంగా జరిగాయి. టీటీడీ అధికారులు తిరుమల నుంచి శ్రీవస్త్రాన్ని తీసుకొచ్చి పీఠాధిపతులకు అందజేశారు. పీఠాధిపతులు శ్రీ విజయేంద్ర తీర్థ మూల బృందావనానికి పంచామృతాభిషేకం నిర్వహించి శ్రీవారి వస్త్రాలతో వివిధ పుష్ప హారాలతో అందంగా అలంకరించారు. అనంతరం శ్రీకర లక్ష్మీనారాయణ దేవర సన్నిధాన రజత ద్వారాన్ని ఆవిష్కరించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

ఆదోనిలో ఉర్దూ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - ఆదోని

ముస్లిం మైనారిటీలకు ఉర్దూ జూనియర్ కళాశాల, హాస్టల్ వసతి ఏర్పాటు చేయాలని కోరుతూ జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిణి సబిహా పర్వీన్‌కు వినతి పత్రం ఇచ్చామని వక్ఫ్ బోర్డు చైర్మన్ నియాజ్ హమ్మద్ శుక్రవారం తెలిపారు. ఉర్దూ మీడియం పదో తరగతి వరకే ఆదోనిలో ఉండటం వల్ల పైచదువులకు వెళ్లలేక ముస్లీం బాలికలు చదువును మధ్యలోనే మానేస్తున్నారని అన్నారు. పైచదువుల కోసం ముస్లీం బాలికలను ఇతర ప్రాంతాలకు పంపేందుకు తల్లిదండ్రులు మొగ్గు చూపడం లేదన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఉర్దూ జూనియర్ కళాశాల ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపిఎస్ఎంఎఫ్సి డైరెక్టర్ ఎస్ఎంబి అన్ను, ఇతర విభాగ డైరెక్టర్లు ఆమ్దూ, అమాన్, ముస్లీం మైనార్టీ పెద్దలు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న అధికారికి ఘన సన్మానం

ప్రజాశక్తి - హాలహర్వి

బదిలీపై వెళ్తున్న సీసీ ఆంజనేయులును అధికారులు ఘనంగా సన్మాంచారు. స్త్రీశక్తి భవన్‌లో శుక్రవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు విధి నిర్వహణలో తన అనుభూతిని అధికారులు, ఉద్యోగులు మహిళలతో పంచుకున్నారు. ఏపీ ఎం శివయ్య మాట్లాడుతూ ఉద్యోగులకు బదిలీలు సహజమేనని అన్నారు. ఈకార్యక్రమంలో సీసీలు, స్త్రీ సంక్షేమ మహిళలు, భగత్ సింగ్ యూత్ ఉన్నారు.

కార్మిక హక్కుల పరిరక్షణే ధ్యేయం

సిఐటియు రాష్ట్ర నాయకులు గౌస్ దేశాయ్

ప్రజాశక్తి - దేవనకొండ

మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర నాయకులు గౌస్ దేశాయ్

నూతన ఆర్థిక విధానాలు ప్రపంచీకరణ నేపథ్యంలో ఉపాధి కరువుతున్న సందర్భంగా కార్మికుల ఉపాధి, హక్కుల పరిరక్షణకు సిఐటియు ఉద్యమస్తుందని, కార్మికుల హక్కుల పరిరక్షణే ధ్యేయం అని సిఐటియు రాష్ట్ర నాయకులు గౌస్ దేశాయ్ పేర్కొన్నారు. శుక్రవారం తెర్నేకల్ గ్రామంలో హమాలీ వర్కర్స్ యూనియన్ ఏర్పాటు సందర్భంగా అరుణ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అరుణ్ కుమార్, వైసీపీ మండల కన్వీనర్ మల్లికార్జున, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరశేఖర్, మాజీ ఉపసర్పంచ్ సత్యరాజ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. సిఐటియు మండల కార్యదర్శి అశోక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ ఉపాధి కరువవుతున్న సందర్భంగా గ్రామీణ ప్రాంతాలలో యువత కష్టపడి పని చేస్తూ స్వతంత్రంగా ఉపాధి పొందుతూ గ్రామాల్లో ఇతరులకు ఆదర్శంగా నిలబడాలని పేర్కొన్నారు. అదేవిధంగా కలిసికట్టుగా యూనియన్‌గా ఏర్పడడం ద్వారా కార్మికచట్టం ప్రకారం కొన్ని హక్కులు వస్తాయని హక్కుల ద్వారా కూడా కొంత లబ్ధి పొందొచ్చు పేర్కొన్నారు. గ్రామంలో కొత్తగా ఏర్పడిన హమాలి వర్కర్స్ యూనియన్ రైతులు, వ్యాపారులతో సఖ్యతగా ఉండి పరస్పర సహకారంతో అవగాహనతో పని చేయాలని, తద్వారా వీరోచిత పోరాట చరిత్ర గల తెర్నేకల్ గ్రామానికి మంచి పేరు తేవాలని వారు కోరారు. ఎర్రజెండా నాయకత్వంలో అనేక పోరాటాలు తెర్నేకల్ గ్రామంలో జరిగాయని రైతులు ,ప్రజలు, సామాన్యులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కారం పోరాటం ద్వారా వచ్చాయని భవిష్యత్తులో కూడా ప్రజా సంఘాల కు గ్రామస్తులు సహకారం ఆదరించాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కార్మిక రైతు యువజన తదితర నాయకులు బజారి, రాఘవరెడ్డి, మహబూబ్ బాషా, రైతు సంఘం మండల కార్యదర్శి సూరి సంజన, సిఐటియు మండల అధ్యక్షులు పాండు, డివైఎఫ్ఐ మండల నాయకులు శ్రీనివాసులు, వీరేంద్ర గ్రామ పెద్దలు చిన్న యంకప్ప, చందరాముడు హమాలీలు సుధాకర్, ఏలియా, రవీంద్రబాబు, శాంతి, ల్లోకయ్య,రంగన్న, చిన్నా రంగన్న, బెంజిమెన్ తదితరులు పాల్గొన్నారు.

డిఐజి సింథిల్ కుమార్, జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్ లను సన్మానిస్తున్న ఎమ్మెల్యేలు

డిఐజి, ఎస్‌పిలతో ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి - మంత్రాలయం

కర్నూలు జిల్లా రేంజ్ డిఐజి సింథిల్ కుమార్, జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్ లను ఆదోని, మంత్రాలయం ఎమ్మెల్యేలు మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం నాడు మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, ఆదోని ఎమ్మెల్యే వై సాయి ప్రసాద్ రెడ్డి డిఐజి, ఎస్పీలను తొలిసారిగా కలిసి శాలువతో సత్కరించి బోకే అందజేశారు. రాఘవేంద్రస్వామి మెమెం టోలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు చట్ట పరమైన చర్యలకు సహకారం అందిస్తామని తెలిపారు. వారి వెంట వైసిపి రాష్ట్ర యువ నేతలు వై. ప్రదీప్ రెడ్డి, వై. జయమనోజ్ రెడ్డి ఉన్నారు.

ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందించాలి

- ఎస్ఎఫ్ఐ,డివైఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి-ఆలూరు

మాట్లాడుతున్న నాయకులు

రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు ఇవ్వాలని శుక్రవారం ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్ నందు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ మండల కార్యదర్శి మైన, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకునే ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందించలేమంటూ చేతులెత్తేయడం దుర్మార్గపు చర్య అన్నారు. విద్యార్థులే పాఠ్యపుస్తకాలు కొనుక్కోవాలంటూ ఇంటర్ విద్యాశాఖ ఆదేశించడాని ఖండిస్తున్నామన్నారు. గత మూడు సంవత్సరాలుగా ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందించడం లేదన్నారు. ప్రభుత్వం విద్యకు చాలా ప్రాధాన్యత ఇస్తున్నామంటూ గొప్ప గొప్ప మాటలు చెప్తున్నా రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖకు సంబంధించిన మంత్రి బొత్స సత్యనారాయణ ఇంటర్మీడియట్ విద్యకు ప్రత్యేక నిధులు కేటాయించకపోగా విద్యార్థులు ఫీజులు ద్వారా కట్టిన ఇంటర్ విద్యామండలి నిధులు మొత్తం నాడు నేడు పథకానికి దారి మళ్లించడం సిగ్గుచేటన్నారు. వెంటనే ఇంటర్మీడియట్ విద్యకు ప్రత్యేక నిధులు కేటాయించి ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందజేయాలని లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కార్యచరణతో ఆందోళన కార్యక్రమం చేపడుతామని పూనుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ మండల ఉపాధ్యక్షుడు గోవర్ధన్, ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షుడు ధనంజయ్, ఎస్ఎఫ్ఐ నాయకులు బసవ,భాస్కర్,వికాస్ తేజ్, తదితరులు పాల్గొన్నారు.

నీటి పంపింగ్ లైన్‌కు భూమిపూజ

ప్రజాశక్తి - పెద్దకడబూరు

భూమిపూజ చేస్తున్న సర్పంచి

మండల పరిధిలోని కల్లుకుంట గ్రామంలో నౌలేకల్ పంపింగ్ హౌస్ నుండి కల్లుకుంట వరకు వాటర్ పంపింగ్ లైన్‌కు సర్పంచి ఇస్మాయిల్ శుక్రవారం భూమి పూజ చేశారు. కల్లుకుంట గ్రామానికి కొన్ని రోజుల నుండి మంచి నీటి సమస్య ఏర్పడముతో గ్రామ సర్పంచ్ ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, నాయకులు ప్రదీప్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, పురోత్తం రెడ్డిల దృష్టికి తీసుకెళ్లగా స్పందించి ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి రూ.20 లక్షలు నిధులు విడుదల చేశారు. ఈమేరకు పనులు ప్రారంభించిన్నట్లు సర్పంచి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్, జాము ముకయ్య, బలముని స్వామి మీసాల నగేష్,చిన్న అయాన్న ముచిగేరి సర్పంచ్, షేరన్, బీసీ లక్ష్మన్న ,బీసీ బసవరాజు,దస్తగిరి బాషా,హాజి మలంగ్, శర్ఫుద్దీన్ మహబూబ్ బాషా, జయరామ్,అర్యాబ్లు అధికారులు పాల్గొన్నారు.

గుడికంబాలి చెరువు పనులు ప్రారంభం

ప్రజాశక్తి - కౌతాళం

మండల పరిధిలోని గుడికంపల్లి చెరువును 50 లక్షల రూపాయల నిధులతో అభివృద్ధి (మరమ్మత్తు) పనులు చేసి రైతులకు సాగునీరు అందిస్తున్నామని సర్పంచ్ సిద్దేశ్, హల్వి మాజీ సర్పంచ్ బసవ ప్రభువు పేర్కొన్నారు. శుక్రవారం చెరువు పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రాలయం ఎమ్మెల్యే వై బాల నాగిరెడ్డి, యువ నాయకులు వై ప్రదీప్ రెడ్డి సహకారంతో నిధులు మంజూరు కావడం జరిగిందన్నారు. రైతులకు చెరువు ద్వారా సాగునీరు అందించి వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లడానికి చెరువు నీరు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ చెరువు ద్వారా గుడి కంబాలి, హాలివి, మురళి గ్రామాలకు చెందిన రైతులు పొలాలకు మీరు అందించడం జరుగుతుందన్నారు. చెరువు పనులు చేపట్టి త్వరలోనే రైతులకు సాగునీరు అందించేలా కృషి చేయాలని ఎమ్మెల్యే బాలనాగరెడ్డి పేర్కొనడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మైనర్ ఇరిగేషన్ ఏఈ వెంకటేశ్వర్లు, క్యూ సి ఏ ఈ రాజు, టెక్నీషియన్ మోహన్ రావు, వైసిపి నాయకులు బసప్ప గ్రామ నాయకులు పాల్గొన్నారు.

జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-పెద్దకడబురు

మండలంలోని చిన్నతుంబళం గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యా కమిటీ చైర్మన్ బి.ఈరన్న ఆధ్వర్యంలో జగనన్న విద్యాకానుక కిట్లను విద్యార్థులకు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చిందన్నారు. ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా విద్యను బోధిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలోని దాదాపు 700 మంది విద్యార్థిని విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు, విద్యా కమిటీ చైర్మన్ ఈరన్న, ఎంపీటీసీ కే.ముత్తమ్మ, మరియు మాజీ ఎంపీటీసీ కెపి.ఎల్లప్ప, బ్రహ్మయ్య,బోడ్డన్న,మదిరి రాముడు,కమ్మరి వీరేష్, కె.గంగాధర్, రమేష్,ప్రభుదాసు,మల్లయ్య,గోసిలి మహాదేవ, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు సన్మానం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

బదిలీపై ఎమ్మిగనూరుకు వచ్చిన తహశీల్దార్ కె. ఆంజనేయులును ఎమ్మిగనూరు మండల కురువ సోదరులు, టిడిపి మండల ఉపాధ్యక్షులు బనవాసి అయ్యాలప్ప, చెన్నాపురం నాగరాజు, కర్నూల్ జిల్లా టిడిపి కురువ సాధికారిక కమిటీ మెంబర్ తిమ్మాపురం వెంకటేశు, కలగొట్ల ఈరన్న, బనవాసి నరసింహులు, పెసలదిన్నె మల్లయ్య, పెసలదిన్నె ఎర్రన్న, దైవందిన్నె వెంకటేశు, తిమ్మాపురం నరసింహులు, తిమ్మాపురం వెంకన్న, మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని శాలువాతో సన్మానించారు.

అంగన్‌వాడీలే పిల్లల ఎదుగుదలకు పునాదులు

ప్రజాశక్తి - చిప్పగిరి

ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీ టీచర్లు

అంగ న్వాడి కేంద్రాలే, పిల్లల బంగారు భవిష్యత్తుకు పునాదులని ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రసన్న అన్నారు. శుక్రవారం, మండల పరిధిలోని రామదుర్గం గ్రామంలోని అంగన్వాడి 1,2,3 కేంద్రాలలో టీచర్లు రామలక్ష్మి, జయమ్మ, శంకరమ్మల ఆధ్వర్యంలో జనభాగీదారి కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ర్యాలీ నిర్వహించిన అనంతరం ఆమె మాట్లాడుతూ మూడు సంవత్సరాలు దాటిన పిల్లలందరూ కూడా అంగన్వాడి పాఠశాలలో ఆటపాటలతో కూడిన విద్య ప్రారంభమవుతుందని తెలిపారు. జనభాగీదారి కార్యక్రమమును రామదుర్గం గ్రామంలో ఘనంగా నిర్వహిం చారు. పిల్లలకు సత్ప్రవర్తనతో కూడిన విద్య అభ్యసించాలంటే చక్కగా పిల్లలను తీర్చిదిద్ది అంగన్వాడి పాఠశాల లో చేర్పించాలని పిల్లల గల తల్లిదండ్రులను కోరారు. ఐదు సంవత్సరాలు దాటిన తర్వాత అంగన్వాడి సర్టిఫికెట్ ద్వారా ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. అంగన్వాడీ టీచర్లు రామలక్ష్మి, జయమ్మ, శంకరమ్మ, ఆయాలు చిట్టెమ్మ, తదితరులుపాల్గొన్నారు.

పట్టుబడిన వాహనాలకు 17న వేలం

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని సెబ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో సీజ్ చేయబడిన వాహనాలకు ఈనెల 17న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు శుక్రవారం సెబ్ సీఐ హరికృష్ణ తెలిపారు. సెబ్ స్టేషన్ ఆవరణలో నంద్యాల ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ శ్రీధర్ రావు ఆధ్వర్యంలో వేలం పాట జరుగుతుందన్నారు. ఈ వేలం పాటలో ఔత్సాహికులు ధారావత్తు మొత్తం చెల్లించి తమతో పాటు ఆధార్ కార్డు, ఐడీ గుర్తింపులను తీసుకుని వచ్చి పాల్గొనవచ్చున్నారు.



చెరువులోని మట్టిని జెసిబి ద్వారా ట్రాక్టర్లతో తరలిస్తున్న దృశ్యం

నకిలీకి అడ్డుకట్టేది..?

- మార్కెట్‌లోకి కల్తీ పత్తి విత్తనాలు - రెండేళ్లుగా నిండా మునిగిన రైతులు - తనిఖీలు చేపట్టని అధికారులు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

జిల్లాలో మార్కెట్‌లోకి యథేచ్ఛగా కల్తీ పత్తి విత్తనాలు వచ్చి చేరుతున్నాయి. జిల్లాలో కల్తీ విత్తనాల వల్ల రైతులు గత రెండేళ్లుగా నిండా మునిగారు. అయినా అధికారులు తనిఖీలు చేపట్టడం లేదు. దీంతో పత్తి రైతుల భవిష్యత్తు ఈ ఏడాది కూడా ప్రశ్నార్థంగా మారనుంది...

గతేడాది ఖరీఫ్ సీజన్‌లో నకిలీ పత్తి విత్తనాలు రైతులకు నష్టాలను మిగిల్చాయి. 2021లో క్వింటా పత్తి అత్యధికంగా రూ.12,500 వరకూ పలికింది. దీంతో 2022లో పత్తి సాగు వైపు రైతులు మొగ్గు చూపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పత్తి సాధారణ సాగు 6.11 లక్షల ఎకరాలు కాగా అంతకుమించి 6.46 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. దీన్ని ఆసరాగా తీసుకున్న కొన్ని పత్తి విత్తనాల కంపెనీలు కల్తీ విత్తనాలను యథేచ్ఛగా అమ్మి సొమ్ము చేసుకున్నాయి. దిగుబడులు లేకపోవడంతో రైతులు నష్టాలను చవిచూశారు. కర్నూలు డివిజన్‌లో 1.02 లక్షల ఎకరాల్లో, ఆదోని డివిజన్‌లో 1.40 లక్షలు, ఎమ్మిగనూరు డివిజన్‌లో 1.29 లక్షలు, ఆలూరు డివిజన్‌లో 1.35 లక్షలు, పత్తికొండ డివిజన్‌లో 1.35 లక్షల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. నకిలీ విత్తనాల దాటికి 5 లక్షల ఎకరాలకు పైగా పంట నష్టపోయింది. సూపర్ కాటన్, జంగి, ఆదిత్య, అఖిర, తడాకా, సూపర్, వింధ్య, లయన్, స్టాలిన్, 3228, కిలాడీ, 429 సూర్య, బిగ్‌బాస్, రాధిక, బిజి 2 వంటి 30 రకాల కంపెనీల విత్తనాలను కొని పంట దిగుబడి రాకపోవడంతో రైతులు నష్టపోయారు. కోట్లల్లో రైతుల పెట్టుబడి మట్టిపాలైంది. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభం కావడంతో కల్తీ పత్తి విత్తనాల రాక ఆరంభమైంది. నకిలీ, కల్తీ విత్తనాలపై దృష్టి సారించాల్సిన వ్యవసాయశాఖ, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు తనిఖీలు చేపట్టడం లేదు. జిల్లా పునర్విభజనలో నేపథ్యంలో తనిఖీలు చేసేందుకు సిబ్బంది కొరత ఉందని సాకుగా చెబుతున్నారు. ఏప్రిల్ నుంచే వ్యవసాయ అధికారులు బృందాలుగా ఏర్పడి విత్తన శుద్ధి కేంద్రాల్లో తనిఖీలు చేయాల్సి ఉండగా ఆ ఊసే లేకుండా పోయింది. బిటి విత్తనాలకు సంబంధించి కో మార్కెటింగ్ లేకపోవడంతో సెంట్రల్ సీడ్ లైసెన్సు కలిగిన కంపెనీలకు చెందిన రకాలతో వివిధ కంపెనీలు ఆయా బ్రాండ్లతో బిటి పత్తి విత్తనాలను సిద్ధం చేస్తున్నాయి. కొన్ని కంపెనీల పేర్లతో కల్తీ విత్తనాలు మార్కెట్‌లోకి వచ్చి చేరుతున్నాయి.

వ్యవహారం సాగుతుందిలా...

పత్తి పంట చేతికందాకా విత్తనాలను రైతుల దగ్గర నుంచి కొందరు దళారులు సేకరించుకుంటారు. జిల్లాలో జిన్నింగ్ మిల్లులు ఎక్కువగా ఉన్న నంద్యాల ప్రాంతం నుంచే ఈ వ్యవహారం మొదలవుతుంది. ఎలాంటి అనుమతులూ లేకున్నా పట్టణాల్లో వివిధ పేర్లతో ఉన్న ప్యాకెట్లలో, గ్రామాల్లో లూజు విత్తనాల పేరుతో ఈ విక్రయాలు సాగుతాయి. తక్కువ ధరతో నాణ్యమైన దిగుబడి వస్తుందంటూ రైతులకు ఆశ చూపుతారు. అయితే కొన్న విత్తనాలకు రసీదులు మాత్రం ఇవ్వరు. అలా నమ్మి సాగు చేసిన రైతులు పొలాల్లో దిగుబడి సరిగ్గా రాకపోవడంతో నిర్ఘాంతపోతారు. తీరా తాము మోసపోయామని తెలుసుకున్న రైతులు విక్రయదారులను ప్రశ్నిస్తే భూమి సరిగ్గా లేదనో, నీరు సరిగ్గా అందలేదనో సాకులు చెప్పి మాట మార్చేస్తారు. జిల్లాలో కొన్నేళ్లుగా ఇతే తంతు సాగుతున్నా అధికారులు మాత్రం ప్రత్యేక దృష్టి సారించడం లేదు. జిల్లాలోని ఆదోని, ఎమ్మిగనూరు, సి.బెళగల్, మంత్రాలయం ప్రాంతాల్లో ఈ నకిలీ విత్తన వ్యాపారాలు యథేచ్ఛగా సాగుతున్నాయి.

కావాలంటే అప్పులూ ఇస్తారు..

నకిలీ విత్తనాల వ్యవహారంలో రైతులకు అప్పు ఆశ కూడా చూపిస్తారు. తమ దగ్గర విత్తనాలు కొంటే అప్పుగా ఇస్తారు. అప్పుకు సంబంధించి ప్రామిసరీ నోటును ఖచ్చితంగా రాయించుకుంటారు. పంట చేతికి రాక నష్టాల్లో కూరుకుపోయినా రైతు నుంచి ముక్కు పిండి మరీ డబ్బును వసూలు చేస్తారు. ఇలా నకిలీ వ్యవహారంలో రైతులు అప్పులపాలు కూడా అవుతున్నారు.

ఎర్రమట్టి దందా..

- చెరువుల్లో పూడికతీత పేరుతో తవ్వకాలు
- పొలాల్లో డంపు చేసి అక్రమంగా తరలింపు - అధికారుల చర్యలు శూన్యం

ప్రజాశక్తి - మహానంది

మహానంది మండలంలో గత కొన్ని రోజులుగా ఎర్రమట్టి అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. అధికారులు మాత్రం చూసీ చూడనట్లు ఉండటంతో పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నల్లమల అటవీ ప్రాంతంలో ఉండే సహజ సంపదలలో ముఖ్యమైనది ఎర్రమట్టి. అధికారం ఉందని మండల నాయకులు ఇష్టం వచ్చినట్లుగా చెరువులను తవ్వి మట్టిని అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

మహానంది మండలం గోపవరం గ్రామంలోని భైరవాణి చెరువులో అధికార పార్టీ నేతల అండదండలతో మండల నాయకులు పూడిక తీత పేరుతో మట్టి అక్రమ తవ్వకాలు చేపడుతున్నారు. అనుమతులు లేకుండానే మూడు జెసిబిలతో 80 ట్రాక్టర్లతో ఎర్రమట్టిని తరలించకుపోతున్న అధికార పార్టీ రాజకీయ రాబందులను అడిగే నాథుడు కరువయ్యాడు. గుట్టు చప్పుడు కాకుండా రెండు రోజుల నుండి రాత్రి సమయంలో గోపవరం చెరువు నుండి అక్రమంగా ఎర్రమట్టి తరలిస్తున్నారు. ఈ విషయంపై అధికారులు చూసీ చూడనట్లు ఉంటున్న పరిస్థితి ఉంది. శుక్రవారం ఉదయం సుమారు 80 ట్రాక్టర్లతో మూడు జెసిబిల సహాయంతో ఎర్రమట్టిని అక్రమంగా తరలించి ఒకచోట డంప్ చేసి ఇటుక బట్టీలకు, వెంచర్లకు అమ్ముకొని లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. అధికార పార్టీ నాయకుల అండదండలతో మండల నాయకులు జేబులు నింపుకుంటున్నారు. శుక్రవారం నంద్యాల జిల్లా కలెక్టర్ అధికారులతో చేపట్టిన వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలోనూ మట్టి అక్రమ తరలింపు జరిగితే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయితే మహానంది మండలంలో మట్టి అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతుంది. మట్టి అక్రమ రవాణా విషయంపై జిల్లా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.. జిల్లా అధికారులు అక్రమ మట్టి తరలింపు వ్యవహారాన్ని నిలుపుదల చేయించి సంబంధిత నాయకులపై చర్యలు తీసుకొని మండలంలోని సహజ వనరులను కాపాడాలని మండల ప్రజలు, రైతులు కోరుతున్నారు.

క్లాప్ డ్రైవర్లకు అందని జీతాలు

- మూడు నెలలుగా ఎదురు చూపు
- డీజిల్ లేక ముందుకు సాగని వాహనాలు - పొడి, తడి చెత్త వాహనాలకు బ్రేక్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం తడి, పొడి చెత్తను తరలించేందుకు ఏర్పాటు చేసిన క్లాప్ వాహనాల డ్రైవర్లకు జీతాలు అందడం లేదు. మూడు నెలలుగా జీతాల కోసం డ్రైవర్లు ఎదురు చూస్తున్నారు. అలాగే గత నెలలో వాహనాలకు డీజిల్ లేక 15 రోజులపాటు నిలిచిపోయాయి. ఈ నెలలో కూడా పది రోజులుగా డీజిల్ లేక వాహనాలు నిలిచిపోయాయి. క్లీన్ ఆంధ్రప్రదేశ్ పేరుతో మున్సిపాలిటీలలోని పలు వార్డుల్లో తడి, పొడి చెత్తను సేకరించేందుకు ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా క్లీన్ ఆంధ్రప్రదేశ్ వాహనాలను ప్రయివేట్ ఏజెన్సీల నిర్వహణలో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వాహనాలకు డీజిల్ లేక ముందుకు కదలడం లేదు. గత నెలలో 15 రోజులు మాత్రమే వీధుల్లో తిరిగాయి. ఈ నెలలో నేటికీ క్లాప్ వాహనాలు వార్డుల్లో తిరగడం లేదు. మున్సిపల్ కార్యాలయానికే పరిమితం అయ్యాయి. ఈ వాహనాలు పది రోజులు తిరిగితే 20 రోజులు ముందుకు కదలడం లేదు. కారణం డీజిల్ కొరత. వీటిని పట్టించుకునే నాధుడే కరువయ్యారు. మున్సిపల్ అధికారులను అడిగితే తమకు సంబంధం లేదంటున్నారు. ఏజెన్సీని అడిగితే ప్రభుత్వం నుండి బకాయిలు రావడం లేదనే సమాధానం తప్ప పరిష్కారం లేదు. కోట్లు ఖర్చు పెట్టి క్లాప్ వాహనాలను కొన్నా అవి మాత్రం మున్సిపాలిటీకే పరిమితం అవుతున్నాయి. క్లాప్ డ్రైవర్లకు మూడు నెలలుగా జీతాలు ఏజెన్సీ ఇవ్వకపోవడంతో వాహనాలను తీయడానికి డ్రైవర్‌లు సుముఖంగా లేరు. చాలీ చాలని వేతనాలతో వాహనాలు నడుపుతూ చెత్త సేకరిస్తున్న తమకు మూడు నెలలుగా జీతాలు ఇవ్వకుంటే ఎలా బతకాలని డ్రైవర్లు వాపోతున్నారు.

ఆగిపోయిన క్లాప్ వాహనాలు

మైనింగ్, రేషన్ అక్రమాలపై ఉక్కుపాదం

- నకిలీ విత్తన మాఫియాను అరికట్టండి
- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో అక్రమ మైనింగ్, రేషన్ బియ్యం రవాణా, నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల విక్రయాల నియంత్రణకు బ్లాక్ స్పాట్లను గుర్తించి ఆ మేరకు కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో అక్రమ మైనింగ్, రేషన్ బియ్యం రవాణా, నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల విక్రయాల నియంత్రణపై సంబంధిత అధికారులతో కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అక్రమాలకు పాల్పడిన వ్యక్తులపై పీడీ యాక్ట్ అమలు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఇరిగేషన్, మైనింగ్, సివిల్ సప్లై, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు జిల్లా, డివిజన్, మండల, గ్రామస్థాయి కమిటీలుగా ఏర్పాటై గుర్తించిన బ్లాక్ స్పాట్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించేలా ఉత్తర్వులు జారీ చేసి ఆ మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏదేని శాఖలో అక్రమాలు జరిగినట్లు ఫిర్యాదులు అందితే సంబంధ అధికారులను బాధ్యులుగా చేస్తూ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నకిలీ విత్తనాల విక్రయాన్ని పూర్తిస్థాయిలో నియంత్రించండి

ఆరుగాలం కష్టపడి పంట పండించే రైతులు దిగుబడులు రాక ఆత్మహత్యలు చేసుకుంటున్న నేపథ్యంలో నకిలీ విత్తనాల విక్రయాన్ని పూర్తిస్థాయిలో నియంత్రించేందుకు వ్యవసాయాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. సిఎం కూడా ఇటీవల నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో నకిలీ విత్తనాల మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారని, లేనిపక్షంలో జిల్లా కలెక్టర్, ఎస్పీలను బాధ్యులను చేస్తామని వెల్లడించినట్లు తెలిపారు. నకిలీ విత్తనాలు, రసాయన ఎరువులు, పురుగు మందులు తదితర వాటిల్లో అక్రమాలు జరగకుండా ప్రతిరోజు తనిఖీలు నిర్వహించి వాస్తవ నివేదికలు అందజేయాలని ఆదేశించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని వచ్చే రెండు నెలలు కీలకంగా వ్యవహరించి చిత్తశుద్ధితో బాధ్యతలు నిర్వహించాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాల కట్టడిలో మీడియాను కూడా భాగస్వామ్యం చేయాలన్నారు. జిల్లా ఎస్‌పి కె.రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ టాస్క్ ఫోర్స్ బృందాలు తనిఖీలు నిర్వహిస్తూ సీరియస్ యాక్షన్ తీసుకోవాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రజలు ముందుకొచ్చి పోలీసులకు సమాచారమిచ్చి సహకరించాలని కోరారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ నిశాంతి.టి, డిఆర్ఓ పుల్లయ్య, మైనింగ్, ఇరిగేషన్, సివిల్ సప్లై, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు పాల్గొన్నారు.

టాస్క్ ఫోర్స్ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

మల్లన్న హుండీ ఆదాయం రూ. 4.03 కోట్లు

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లకు గడచిన 27 రోజులలో భక్తులు హుండీలలో చెల్లించుకున్న కానుకలను లెక్కించగా రూ. 4.03 కోట్లు ఆదాయం వచ్చినట్లు ఇఒ లవన్న తెలిపారు. శుక్రవారం దేవస్థానంలోని కళ్యాణ మండపంలో ఇఒ ఆధ్వర్యంలో హుండీ కానుకలను లెక్కించారు. ఈ లెక్కింపులో నగదు రూ.4 కోట్ల 3 లక్షల 29 వేల 226 నగదు లభించింది. వీటితో వెండి 6 కేజీల 130 గ్రాములు, బంగారం 521 గ్రాముల 700 మిల్లి గ్రాములు లభించాయి. విదేశీ కరెన్సీలు యూఎస్‌ఏ డాలర్లు 3740, కువైట్ దినార్లు 10, సింగపూర్ డాలర్లు 30, యూఏఈ దిరహంస 15, ఆస్ట్రేలియా డాలర్లు 70, మలేషియా రింగిట్స్ 15, యూరోలు 60 లభించాయి. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, సిబ్బంది, శివసేవకులు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బంది నుండి సమస్యలు తెలుసుకుంటున్న జిల్లా ఎస్పీ

సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత : ఎస్‌పి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవియన్స్ డే నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి అన్నారు. సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు గ్రీవియన్స్ డే నిర్వహించారు. జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్లు, ఆయా విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది వారి మ్యూచువల్ ట్రాన్స్ఫర్, మెడికల్ గ్రౌండ్స్, రిక్వెస్ట్ బదిలీలపై ఎస్‌పికి విన్నవించుకున్నారు. సమస్యలకు తగిన పరిష్కారం చూపుతామని సిబ్బందికి ఎస్‌పి భరోసా కల్పించారు. అనంతరం ఎస్‌పి మాట్లాడుతూ ప్రతి శుక్రవారం నిర్వహించే పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమంలో సిబ్బంది వారి సమస్యలను నిర్భయంగా తెలియజేసుకోవచ్చని తెలిపారు. విధి నిర్వహణలో సిబ్బంది సతమత పడకుండా వారి సమస్యలను తొలగించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చెయ్యటమే లక్ష్యమన్నారు. సిబ్బంది ఫిర్యాదులను పరిష్కరించాలని సంబంధిత జిల్లా పోలీసు కార్యాలయ అధికారులను ఆదేశించారు. కార్యాక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి.వెంకట రాముడు, స్పెషల్ బ్రాంచ్ సిఐ దస్తగిరి బాబు, ఎస్‌పి సిసి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో లైన్‌మెన్‌కు గాయాలు

ప్రజాశక్తి - అవుకు : అవుకు మండలం కొండమనాయనపల్లి గ్రామంలో శుక్రవారం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతులు చేస్తుండగా షాక్ కొట్టి లైన్‌మెన్ శివకు గాయాలైన ఘటన చోటు చేసుకుంది. తృటిలో ప్రాణాపాయం తప్పింది. ఎఇ పకీరయ్య మాట్లాడుతూ విద్యుత్ మరమ్మతులు చేస్తున్న మాట వాస్తవమేనని, లైన్మెన్ శివ ఒకవైపు చేయాల్సిన పనిని మరోవైపు చేయడంతో షాక్ తగిలిందని తెలిపారు.

కెసి కెనాల్ కట్ట
మట్టి అక్రమ తరలింపుపై కేసు నమోదు

ప్రజాశక్తి - పాములపాడు : కెసి కెనాల్ కట్ట మట్టిని అక్రమంగా తరలించిన రామకృష్ణారెడ్డిపై కేసు నమోదు చేసినట్లు పాములపాడు ఎస్సై జి అశోక్ శుక్రవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. జూటూరు గ్రామ సమీపంలో కెసి కెనాల్ పక్కన ఉన్న ఎల్లమ్మ కాలువ దగ్గర జూటూరు గ్రామానికి చెందిన రామకృష్ణారెడ్డి కట్ట మట్టిని 100 మీటర్లు పొడవు, రెండు మీటర్లు వెడల్పు, రెండున్నర మీటర్ లోతుతో సుమారు 500 క్యూబిక్ మీటర్ల మట్టిని కెనాల్ అధికారుల అనుమతి లేకుండా సొంత అవసరాలకు వినియోగించుకున్నాడని కెసి కెనాల్ ఎఇ శ్రీనివాస్ నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బాధ్యతతో విధులు నిర్వహించండి

- కౌలు రైతులకు పంట రుణాలు మంజూరు చేయండి
- నకిలీ విత్తన దుకాణాలపై ఉక్కుపాదం - జిల్లా కలెక్టర్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో జిల్లాలో నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాలపై కఠినంగా వ్యవహరిస్తూ నకిలీపై ఉక్కు పాదం మోపాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. మార్కెట్లో నకిలీ విత్తనాలు అమ్మినట్లు తెలిసినా, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోయినా అలాంటి అధికారులపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్, జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన రైతులు, కౌలు రైతులందరికీ పంట రుణాలు ఇవ్వాలని లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్‌ను ఆదేశించారు. 12,890 సిసిఆర్సి కార్డుల జారీ లక్ష్యంలో భాగంగా 18 శాతం మాత్రమే పంపిణీ చేశారని, మరోసారి స్పెషల్ క్యాంపెయిన్ ఏర్పాటు చేసి కార్డులు జారీ చేయాలన్నారు. జీలుగ విత్తనాలు 4560 క్వింటాళ్లకు రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్న నేపథ్యంలో ఆ మేరకు సప్లై చేయాలని ఏపి సీడ్స్ మేనేజర్‌ను ఆదేశించారు. పంట ఉత్పత్తుల ధరలను వైయస్సార్ సీఎం యాప్‌లో అప్లోడ్ చేయాలన్నారు. రైతుల నుండి సీడ్ శాంపిల్స్ సేకరించి సంబంధిత ల్యాబ్‌లకు పంపి ఫలితాలు త్వరగా వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ మాట్లాడుతూ నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టేందుకు ముమ్మర ఆకస్మిక దాడులు నిర్వహించాలన్నారు. ఉద్యాన శాఖ ద్వారా 50 శాతం సబ్సిడీపై టార్పాలిన్లు రైతులకు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జూలై 8న 2022 సంవత్సరానికి సంబంధించిన క్రాఫ్ ఇన్సూరెన్స్ మొత్తాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి విడుదల చేస్తారని తెలిపారు. పశుసంవర్ధక శాఖ ద్వారా ఎద్దులకు ఇన్సూరెన్స్ వర్తించే విషయంపై విస్తృత ప్రచారం కల్పించాలని పశుసంవర్ధక శాఖ జెడిని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ నిశాంతి.టి. ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్పర్సన్ కర్రా గిరిజ, ఉద్యాన శాఖ అధికారి నాగరాజు, మార్కెటింగ్, సెరికల్చర్, మార్క్ఫెడ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

సమయపాలన పాటించాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - చాగలమర్రి : సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపీడీఓ మహబూబ్ దౌలా సూచించారు. శుక్రవారం చాగలమర్రి పట్టణంలోని 1, 5వ సచివాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి వివిధ రికార్డులను పరిశీలించారు. సచివాలయ పరిధిలో అందించే వివిధ సర్వీసులను గురించి అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారం కోసం వచ్చే వారితో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. ప్రతి రోజు స్పందన కార్యక్రమానికి వచ్చిన పిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఈఓఆర్‌డి సుదర్శన్ రావు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపిడిఒ

క్లాత్ మర్చెంట్ అసోసియేషన్

భవన నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని యాగంటిపల్లె రోడ్డులో క్లాత్ మర్చెంట్ అసోసియేషన్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, వైసిపి అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డిలు శుక్రవారం భూమి పూజ చేశారు. యాగంటిపల్లె రహదారిలో బనగానపల్లె పట్టణ క్లాత్ మర్చంట్ అసోసియేషన్‌కు ఉచితంగా ఐదు సెట్ల స్థలాన్ని ఎమ్మెల్యే కేటాయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బనగానపల్లె పట్టణంలో వ్యాపార రంగంలో ఆర్యవైశ్యుల ప్రముఖ పాత్ర ఉందని చెప్పారు. దూర ప్రాంతాలకు చెందిన వ్యాపారస్తులు రాత్రిపూట విడిది చేయడానికి అసోసియేషన్ భవనాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు తను దృష్టికి తేవడంతో భవన నిర్మాణానికి స్థలాన్ని కేటాయించినట్లు తెలిపారు. మండి మర్చంట్ అసోసియేషన్ భవన నిర్మాణం ప్రభుత్వ అనుమతులు లేకపోవడంతో నిలబడిపోయిన సంగతి ప్రజలకు తెలిసిన విషయమేనని, వాటికి కూడా అనుమతులు తెచ్చి పూర్తి చేశామన్నారు. నియోజకవర్గానికి అహర్నిశలు కష్టపడే నాయకుడు ఎవరో ప్రజలు తెలుసుకోవాలని, కష్టపడే నాయకునికి మళ్ళీ అఖండమైన మెజార్టీతో గెలిపించాలని కోరారు. క్లాత్ మర్చెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు గుండా రవికుమార్ మాట్లాడుతూ తమ అసోసియేషన్ కు ఉచితంగా ఐదు సెంట్లు స్థలాన్ని ఎమ్మెల్యే కేటాయించారని, 2024 ఎన్నికల్లో అఖండ మెజార్టీతో గెలిపించుకుని తమ రుణాన్ని తీర్చుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివరామయ్య, గ్రామపంచాయతీ ఈవో ఖలీల్, వైసిపి జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, ఆర్యవైశ్య అధ్యక్షుడు గాదంశెట్టి వేణుగోపాల్, శాశ్వత గౌరవ అధ్యక్షుడు పసుపల సుబ్బ సత్యనారాయణ, నాయకులు డాక్టర్ రవికుమార్, నూకల వెంకటసుబ్బయ్య, నూకల విజయ్ కుమార్, గాదంశెట్టి మోహన్, మండి మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్బ సత్యనారాయణ శెట్టి, ప్రధాన కార్యదర్శి చక్రపాణి, టీవీ షో రూమ్ గోపాల్, యాగంటి దేవస్థానం చైర్మన్ తోట బుచ్చిరెడ్డి, సీనియర్ న్యాయవాది మాధవరెడ్డి వైసిపి నాయకులు జిల్లెళ్ళ శంకర్ రెడ్డి, అబ్దుల్ ఫైజ్, డాక్టర్ మహ్మద్ హుస్సేన్, సైకిల్ షాప్ మహబూబ్ వలి, క్లాత్ మర్చంట్ అసోసియేషన్ సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

మోకాళ్లపై కూర్చుని నిరసన తెలుపుతున్న కార్మికులు

పర్మినెంట్ చేయాలి : సిఐటియు

- మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు నిరసన

ప్రజాశక్తి - నందికొట్కూరు

మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని సిఐటియు జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నందికొట్కూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో మోకాళ్లపై కూర్చుని వినూత్న రీతిలో శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు తగినంత వేతనం ఇవ్వకుండా మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్షంలో ఉండగా ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలు పట్టించకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. తక్షణమే మున్సిపల్ కార్మికులకు పర్మినెంట్ చేస్తూ వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్ నాగేశ్వరావు, భాస్కర్, చాంద్ బాష, సర్వర్ ఖాన్, నాగమ్మ, భాగ్యలక్ష్మి, లలితమ్మ, రాముడు, విజయ్ కుమార్, అబ్దుల్ భాషిత్, శరత్ అశోక్ కుమార్, మద్దూరు వెంకటరమణ, విజయ్, స్వామన్న, పాల్గొన్నారు.

ఎండియు ఆపరేటర్లకు దరఖాస్తు

ప్రజాశక్తి - చాగలమర్రి

గ్రామాల్లో ఇంటింటికి రేషన్ పంపిణీ చేసే వాహన చోదకులు (ఎండీయూ) ఆపరేటర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దారు విజయకుమార్ శుక్రవారం తెలిపారు. ఆయనమ ఆట్లాడుతూ మండలంలోని పెద్దబోధనం, చిన్నవంగలి, గొడిగనూరు గ్రామాల్లో ఎండియు పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. లైసెన్సులు కలిగి, అర్హత కలిగిన వారు ఈనెల 21వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పెద్దబోధనం షెడ్యూల్డ్ కులాల అభ్యర్థి, చిన్నవంగలి, గొడిగనూరు గ్రామాల్లో బీసీ కులాల అభ్యర్థులు అర్హులని వివరించారు. నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.



మాట్లాడుతున్న తహసీల్దారు విజయ్ కుమార్

ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమక్షంలో వైసిపిలో చేరుతున్న దృశ్యం

టిడిపి నుండి వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - బనగానపల్లె

అవుకు మండలం మర్రికుంట తండా గ్రామానికి చెందిన గోపాల్ నాయక్, బాలు నాయక్, లక్ష్మా నాయక్, వెంకటేష్ నాయక్, రమేష్ నాయక్‌లు టిడిపిని వీడి వైసిపిలో చేరారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నివాసంలో టిడిపిని వీడి వైసిపిలో చేరారు. వీరికి ఎమ్మెల్యే వైసిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. పార్టీలకు, కులాలకు అతీతంగా అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైసిపిలోకి చేరుతున్నారని చెప్పారు. 2024 ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ కష్టపడి మళ్ళీ ముఖ్యమంత్రిగా వైయస్ జగన్ మోహన్ రెడ్డిని చేసుకోవాలని, అప్పుడే మళ్ళీ కులమతాలకు, పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో కునుకుంట్ల గ్రామ సచివాలయం కన్వీనర్ పురుషోత్తం నాయుడు, కంబగిరి రాముడు నాయక్, లక్ష్మా నాయక్, రాముడు నాయక్, రామాంజి నాయక్, పుల్లయ్య నాయక్‌లు పాల్గొన్నారు.

మల్లన్న భక్తులకు వడ ప్రసాదం : ఇఒ

ప్రజాశక్తి - శ్రీశైలం : శ్రీశైల క్షేత్రంలోని మల్లన్న భక్తులకు వడ ప్రసాదాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి లవన్న తెలిపారు. శుక్రవారం ఉదయం సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి అనంతరం మొదటగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి లవన్న వడ ప్రసాదాన్ని కొనుగోలు చేశారు. ఇఒ మాట్లాడుతూ శ్రీశైలం దేవస్థానం భక్తులకు ఇప్పటికే లడ్డు, పులిహోర ప్రసాదాలను అందుబాటులో ఉంచామని, వీటితో పాటు వడ ప్రసాదాన్ని కూడా కొత్తగా అందుబాటులోకి తెచ్చామన్నారు. 45 గ్రాములు కలిగిన ఈ వడ ప్రసాదాన్ని 20 రూపాయలకు విక్రయించేందుకు దేవస్థానం నిర్ణయించినట్లు తెలిపారు. ఈ వడ ప్రసాదం లడ్డు కౌంటర్లలోనే అందుబాటులోనే ఉంచామన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా వడ ప్రసాదాలను తయారు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఆయా శాఖ పర్యవేక్షకులు దేవిక, ప్రసాదాల తయారీ గుమస్తా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ఇంటి స్థలాలు, ఇల్లు నిర్మించాలి

- ఎపి మున్సిపల్ పర్మినెంట్ వర్కర్స్ యూనియన్

ప్రజాశక్తి - నంద్యాల : మున్సిపల్ పర్మినెంట్ కార్మికులకు ఇంటి స్థలాలు ఇచ్చి పక్కా ఇల్లు నిర్మించి మున్సిపల్ కాలనీ ఏర్పాటు చేయాలని మున్సిపల్ పర్మినెంట్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ రవిచంద్ర రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాబున్నిసాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు కె.ప్రసాద్, పట్టణ కార్యదర్శి డి.శ్రీనివాసులు, రైతు సంఘం జిల్లా కో కన్వీనర్ జి సోమన్న, మున్సిపల్ పర్మినెంట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు కోటయ్యలు మాట్లాడారు. గతంలో శిల్పా మోహన్ రెడ్డి మంత్రిగా ఉన్నప్పుడు మున్సిపల్ పర్మినెంట్ కార్మికులకు 96 మందికి క్వాటర్స్ ఇచ్చారన్నారు. మిగతా 58 మందికి ఇవ్వలేదని, వారికి ఇప్పటికైనా ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ పర్మినెంట్ కార్మికులు పాల్గొన్నారు.

గల్లంతయిన వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - బేతంచెర్ల : మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ సమీపంలో వెలిసిన మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలోని నీటి పెద్దగుండంలో గురువారం సాయంత్రం గల్లంతయిన వల్లే భాస్కర్ మృతదేహం శుక్రవారం లభ్యమయింది. ఆలయ అధికారులు, ఎస్సై శివ శంకర్ నాయక్, డోన్ విపత్తుల నివారణ కేంద్రం ఎస్సై రంగస్వామి గౌడ్ ఆధ్వర్యంలో గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం లభ్యమయింది. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పాలిటెక్నిక్ కళాశాలకు ఎఐసిటిఇ అనుమతి

ప్రజాశక్తి - బేతంచర్ల : మండలంలోని గోరుమానుకొండ సమీపంలో నిర్మిస్తున్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీకి ఎఐసిటిఇ న్యూఢిల్లీ వారిచే అనుమతి లభించింది. కళాశాలలో నాలుగు బ్రాంచ్‌లకు గాను ప్రతి బ్రాంచిలోను 60 సీట్లకు అనుమతి లభించిందని ఒఎస్‌డి ఎంపి.రాజేష్ తెలిపారు. శుక్రవారం బేతంచెర్ల ఎంపిపి బుగ్గన నాగభూషణం రెడ్డిని గోరుమానుకొండలో ఆయన కలిసి ఏఐసిటిఈ అప్రూవల్ పత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ కళాశాలలో అడ్మిషన్స్ వెబ్ ఆప్షన్స్ ద్వారానే ఉంటాయని తెలిపారు. ఈ నెల వెబ్ ఆప్షన్స్ అతి త్వరలో ఉంటాయని, విద్యార్థులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని చెప్పారు. కళాశాలలో అత్యాధునిక కోర్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ కోర్సులకు అనుమతిని వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు బాబుల్ రెడ్డి, గూని నాగరాజు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎంపిపికి అనుమతి పత్రాన్ని అందజేస్తున్న ఒఎస్‌డి

కంకర రోడ్డుతో కష్టాలు..

- వేంపెంట బిటి రోడ్డుకు అనుమతి లేదని ఆపిన ఫారెస్ట్ అధికారులు - ఇబ్బందుల్లో వాహనదారులు
- ఫారెస్ట్‌లో మట్టి తోలకంపై విమర్శలు - పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

ప్రజాశక్తి - పాములపాడు

పాములపాడు మండలం భానుముక్కల టర్నింగ్ నుండి వేంపేంట వరకు బిటి రోడ్డు నిర్మాణం కోసం కంకర వేసి వదిలేశారు. దీంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాములపాడు మండలం భానుముక్కల టర్నింగ్ నుండి వేంపేంట వరకు బిటి రోడ్డు నిర్మాణం కోసం రూ. 1 కోటి 59 లక్షలు మంజూరు అయ్యాయి. గత కొంత కాలంగా ఈ నిర్మాణ పనులు చేసేందుకు కాంట్రాక్టర్ ముందుకు రాకపోవడంతో వేంపెంట-బానకచర్ల గ్రామాల ప్రజలు గుంతల రోడ్డులో ప్రయాణం చేయలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎట్టకేలకు కాంట్రాక్టర్ ముందుకు వచ్చి గత రెండు నెలల క్రితం బిటి రోడ్డు నిర్మాణం చేసేందుకు 1.5 కిలోమీటర్ కంకర పరిచాడు. ఇంతలో ఫారెస్ట్ అధికారులు అనుమతులు లేవని పనులను నిలుపుదల చేశారు. కాంట్రాక్టర్ నిర్మాణ పనులు మధ్యలో వదిలేసి వెళ్లిపోయారు. కంకర పరిచి రెండు నెలలు కావస్తున్నా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. బిటి రోడ్డు నిర్మాణాన్ని నిర్మించకపోవడంపై ప్రజల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న పరిస్థితి ఉంది. మరోపక్క తెలుగు గంగ రిటీట్‌మెంట్ పనులలో భాగంగా భానుముక్కుల నుండి ఎర్రమట్టిని తోలేందుకు ఫారెస్ట్‌లో భారీ వెహికల్స్, టిప్పర్లు తిరిగేందుకు ఫారెస్ట్ అధికారులు పర్మిషన్ ఇవ్వడంపై ప్రజల్లో చర్చ జరుగుతుంది. పబ్లిక్ బిటి రోడ్డుకు అనుమతులు లేవని ఆపేసి ఫారెస్ట్‌లోనే భారీ వెహికల్స్ టిప్పర్లు తిరిగేందుకు పర్మిషన్ ఇవ్వడంపై ప్రజల్లో తీవ్ర చర్చ జరుగుతుంది. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల స్పందించి బిటి రోడ్డు నిర్మాణంకి ఫారెస్ట్ అధికారులతో పర్మిషన్ తీసుకొని పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కంకర వేసిన వదిలేసిన దృశ్యం

బిటి రోడ్డుకు అనుమతులు ఇవ్వాలి

ఎర్రమట్టి తోలేందుకు ఫారెస్ట్‌లో అనుమతులు ఇచ్చిన అధికారులు ఇటు రోడ్డు నిర్మాణాన్ని ఆపడం సరైనది కాదు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బిటి రోడ్డు నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకొని ప్రజలకు రవాణా సౌకర్యాన్ని కల్పించాలి.

- సిపిఎం మండల కార్యదర్శి సోమన్న.

కంకర రోడ్డుతో ప్రయాణం నరకం

బిటి రోడ్డు నిర్మాణం గత రెండు నెలల నుండి జరుగుతుంది. ఫారెస్ట్ అధికారులు అనుమతి లేదని నిలిపివేయడంతో రోడ్డు నిర్మాణం మధ్యలో ఆగింది. దీంతో కంకర రోడ్డులో ప్రయాణం చాలా ఇబ్బందికరంగా మారింది. అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణాన్ని త్వరగా చేపట్టాలి.

- జయన్న వేంపెంట గ్రామం.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : ఎన్ఎంయుఎ

ప్రజాశక్తి-డోన్

ఆర్‌టిసి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నేతలు ఆర్‌టిసి కడప నాల్గో జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావును కోరారు. అసోసియేషన్ జోనల్ కార్యదర్శి ఎం. చెన్నారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు కె.సుదర్శన్ రావు, జిల్లా కార్యదర్శి కె.శివరాంలు ఆయనను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగం నుంచి సస్పెండ్ అయి, సర్వీస్ నుంచి వైదొలిగిన ఉద్యోగులను మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని కోరారు. క్యాడర్ స్ట్రెంత్‌ను సిస్టమ్యాటిగ్గా కొనసాగించాలని, సీనియార్టీ ప్రకారం బదిలీలు అమలు చేయాలని తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సానుకూలంగా స్పందించి త్వరలోనే న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వర రావుకు పుష్పగుచ్చం అందజేస్తున్న ఎన్ఎంయుఎ నాయకులు

వంద శాతం సబ్సిడీతో పండ్ల తోటల పెంపకం : ఎపిడి

ప్రజాశక్తి - పగిడ్యాల

చిన్న సన్న కారు రైతులకు వంద శాతం సబ్సిడీతో పండ్ల తోటల పెంపకంపై అవగాహన కల్పించాలని ఎపిడి అన్వరా బేగం వాలంటీర్లకు సూచించారు. మండలంలోని నెహ్రు నగర్ గ్రామంలో సచివాలయంలో పండ్ల తోటల పెంపకంపై వాలంటీర్లతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిడి మాట్లాడారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద 17 రకాల పండ్ల, పూల తోటల పెంపకంకు వంద శాతం సబ్సిడీ ఇవ్వనున్నట్లు చెప్పారు. 15 రకాల పండ్ల మొక్కలు, 2 రకాల పూల మొక్కలను జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఇస్తారన్నారు. వాలంటీర్ల పరిధిలో ఉన్న 50 ఇండ్లలో ఉన్న సన్న చిన్న కారు రైతులకు పండ్లతోటలు పెంచుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఎవరైనా రైతులు ఆసక్తి కనపరిస్తే వ్యవసాయ అధికారులకు, ఉపాధి సిబ్బందికి తెలియజేయాలన్నారు. మండలంలో ఎక్కడైనా ప్రభుత్వ స్థలాలు, పోరంబోకు స్థలాలు ఉంటే మొక్కలు నాటేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ , పాఠశాలల మైదానాలలో 100 మొక్కలకు తగ్గకుండా మొక్కలు నాటించేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎపిఒ మద్దిలేటి, పంచాయతీ కార్యదర్శి వీరన్న యాదవ్, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీకాంత్, వాలంటీర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎపిడి అన్వరా బేగం

ఇఒఆర్‌డిగా బాలునాయక్ బాధ్యతలు

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూర్ మండలంలోని సున్నిపెంట, వడ్ల రామాపురం గ్రామ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న బాలునాయక్‌ను జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం మండల ఇన్చార్జి ఈఓఆర్‌డిగా నియమిస్తూ మండల అభివృద్ధి అధికారి జి.మోహన్ కుమార్, ఏవో జివి.మోహన్ కుమార్‌లు నియామక పత్రాలను బాలునాయక్‌కు అందజేశారు. ఈఓఆర్డిగా బాధ్యతలు స్వీకరించిన బాలు నాయక్‌ను మండల ప్రజా పరిషత్ సిబ్బంది, పలువురు ప్రజా ప్రతినిధులు అభినందించారు.

ఎంపిడిఒ నుండి ఇఒఆర్‌డిగా బాధ్యతలు స్వీకరిస్తున్న బాలునాయక్

రోడ్డు ప్రమాదంలో ఎస్ఆర్‌బిసి ఉద్యోగి మృతి

ప్రజాశక్తి - అవుకు

మృతి చెందిన బాలాజీ సింగ్

అవుకు-బనగానపల్లి రహదారిలో జమ్ములమ్మగుడి సమీపాన పెద్ద మోరీ వద్ద శుక్రవారం ఆటో బోల్తా పడిన ఘటనలో బనగానపల్లెలో ఎస్ఆర్‌బిసి డివిజన్-1లో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న బాలాజీ సింగ్ (58) మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. బనగానపల్లె నుండి అవుకు వస్తున్న ఆటో జమ్ములమ్మ గుడి సమీపంలో పెద్దమోరి వద్ద ఆదుపు తప్పి బోల్తా పడింది. ఆటోలోని ప్రయాణికుల్లో బాలాజీ సింగ్ అక్కడికక్కడే మృతి చెందారు. అవుకులో విధులు నిర్వహిస్తున్న బాలాజీ సింగ్ ఇటీవల బనగానపల్లెకు బదిలీ అయ్యారు. బదిలీకి చెందిన కాగితాలను కొన్ని అవుకులోని కార్యాలయంలో అందజేసేందుకు వస్తుండగా ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. మరొక ప్రయాణికుడు గాయపడ్డాడు. అతనిని చికిత్స నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాలాజీ సింగ్‌కు భార్య, పిల్లలు ఉన్నారు. అవుకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తహశీల్దార్‌కు సన్మానం

ప్రజాశక్తి - రుద్రవరం

రుద్రవరం తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన రవీంద్ర ప్రసాద్‌ను హరినగరం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు సవరం నాగముని శుక్రవారం సన్మానించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ రవీంద్ర ప్రసాద్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి శాలువా పూల మాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో వీఆర్వో ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌ను సన్మానిస్తున్న వైసిపి నాయకుడు సవరం నాగముని తదితరులు

చెంచు గిరిజనుల భూములు కాపాడాలి

- గిరిజన సంక్షేమ సంఘం నాయకులు జవహర్ నాయక్

ప్రజాశక్తి - ఆత్మకూర్

శ్రీశైలం నియోజకవర్గంలోని పలు చెంచు గిరిజన గూడెంలలో చెంచు గిరిజనుల భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని గిరిజన సంక్షేమ సంఘం నాయకులు జవహర్ నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం మండలంలోని చెంచు గిరిజనులను ఆయన కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రుద్రకోడూరు చెంచుగూడెం, చదరంపెంట చెంచుగూడెం, కొట్టాల చెరువు, ఎర్రగుంట్ల చెంచుగూడెం, నాగలూటి చెంచు గూడెం చెంచు గిరిజనుల భూములు అన్యాక్రాంతమవుతున్నాయని తెలిపారు. చెంచు గిరిజనులకు రూ. 5 వేలు, రూ. 10 వేలు ఆశచూపి వారి భూమిని గిరిజనేతరులు సాగు చేస్తూ అనుభవిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన భూమిని సాగు చేసుకోవడానికి ఆర్థిక స్తోమత లేక, వ్యవసాయ పనిముట్లు, పొలం దున్నుకోవడానికి ఎద్దులు, ట్రాక్టర్లు లేక తక్కువ డబ్బుకే గుత్తకు ఇస్తున్నారని తెలిపారు. చాలా మంది చెంచు గిరిజన రైతులకు రైతుభరోసా డబ్బులు రావడం లేదన్నారు. ఆర్‌డిఎఫ్ఆర్ కింద గిరిజనులకు ఇచ్చిన భూములు వారికే చెందాలన్నారు. చదరంపెంట, ఎర్రగుంట్ల, ముసలి మడుగు చెంచుగూడెంలకు చెందిన చెంచు గిరిజనుల భూములు అటవీశాఖ అధికారులు ఆక్రమించుకోవాలని చూడడం దుర్మార్గమన్నారు. రెండు సంవత్సరాల పాటు కరోనాతో చెంచు గిరిజనుల ఆరోగ్యం సరిగా లేక పంటలు వేయలేదని, అదే అదునుగా చేసుకుని చెంచు గిరిజనులను పొలాలకు వెళ్లనీయకుండా అటవీశాఖ అధికారులు అడ్డగించడం అన్యాయమన్నారు. అటవీ హక్కుల చట్టం ప్రకారం సర్వ హక్కులు చెంచు గిరిజనులకే ఉన్నాయని, అన్నివిధాలుగా చెంచు గిరిజనులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

గిరిజనుల సమస్యలను తెలుసుకుంటున్న జవహర్ నాయక్

విద్యా కానుక కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - నందికొట్కూరు : జూపాడుబంగ్లా మండలం పారుమంచాల గ్రామ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను గ్రామ సర్పంచి మాధవరం ప్రకాశం శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచి గ్రామంలో ప్రాథమిక పాఠశాలకు తన సొంతం స్థలాన్ని 25 సెంట్లు కేటాయించానని తెలిపారు. గ్రామ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎం.కర్ణ, రైతు సంఘం నాయకులు టి రసూల్, వాలంటీర్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల లబ్ధిదారులు ఆందోళన

ప్రజాశక్తి - చాగలమర్రి : మండలంలోని నేలంపాడు గ్రామంలో గతంలో ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. గత పదేళ్ల క్రితం టిడిపి ప్రభుత్వ హయాంలో గ్రామంలోని దళితులకు దాదాపు 60 మందికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. నేడు అదే స్థలంలో జగనన్న కాలనీగా ఏర్పాటు చేసి తమకు కాకుండా ఇతరులకు ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు అధికారులు సిద్ధమయ్యారని శుక్రవారం ఆందోళన చేపట్టారు. తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఇలా చేయడం ఏమిటని గ్రామానికి చెందిన లబ్ధిదారులు బుజ్జమ్మ, పుల్లమ్మ, దావీదు, మహేష్ తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ పట్టాలు రద్దు చేసి ఇతరులకు ఇస్తే మా పరిస్థితి ఏమిటని వారు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు తమ పట్టాలను తిరిగి తమకే మంజూరు చేయాలని కోరారు.


నేలంపాడులో పట్టాలు చూపుతూ ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు

చికిత్సలో మార్పులపై అవగాహన అవసరం

- ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ

ప్రజాశక్తి - నంద్యాల

వైద్యులు పలు జబ్బులకు చికిత్సలలో వస్తున్న ఆధునిక విధానాలు, మార్పులపై నిరంతరం తమ పరిజ్ఞానాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉంటుందని, తద్వారా మాత్రమే మెరుగైన వైద్య సేవలు అందించడానికి వీలు కలుగుతుందని ఎపి రాష్ట్ర ఐఎంఎ అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ అన్నారు. శుక్రవారం నంద్యాలలోని స్థానిక సూరజ్ హెూటల్ సమావేశ భవనంలో హైదరాబాద్ సోమాజిగూడ యశోద ఆసుపత్రి సహకారంతో నంద్యాల ప్రాంత వైద్యులకు ఐఎంఎ ఆధ్వర్యంలో వైద్య సదస్సు నిర్వహించారు. 'గుండె జబ్బుల చికిత్సలో ఆధునిక విధానాలు'పై ప్రముఖ గుండె జబ్బుల నిపుణులు డాక్టర్ గురు ప్రకాష్, "తీవ్ర ఊపిరితిత్తుల సమస్యలపై నూతన విధానాలు'పై డాక్టర్ విశ్వేశ్వరన్, 'క్యాన్సర్ శస్త్ర చికిత్సలో రోబోటిక్ విధానాలు'పై డాక్టర్ జయంత్ వక్తలుగా పాల్గొని మల్టీమీడియా ప్రజెంటేషన్ ద్వారా వైద్యులకు వివరించారు. కార్యక్రమంలో ఐఎంఎ నంద్యాల అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ జఫరుల్లా, డాక్టర్ చంద్రశేఖర్, కోశాధికారి డాక్టర్ అనిల్, ఐఎంఎ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ అనిల్ కుమార్, సీనియర్ వైద్యులు డాక్టర్ సహదేవుడు, డాక్టర్ మధుసూదన రావు, వైద్యులు, యశోద ఆసుపత్రి ప్రాంతీయ సమన్వయకర్త రమణ తదితరులు పాల్గొన్నారు.

సదస్సులో ప్రసంగిస్తున్న ప్రముఖ గుండె జబ్బుల నిపుణులు డాక్టర్ గురు ప్రకాష్

చికెన్ కొడుతున్న దుకాణదారుడు

భారీగా పెరిగిన కోడి మాంసం ధరలు

ప్రజాశక్తి - కొత్తపల్లి

కోడి మాంసం ధరలు భారీగా పెరిగాయి. గ్రామీణ ప్రాంతాల పేద, సామన్య ప్రజలకు చికెన్ ధరలు బెంబేలెత్తిస్తున్నాయి. గత వారం దాకా కోడి మాంసం ధరలు రోజురోజుకు 220 నుంచి 250 రూపాయలు పెరుగుతూ, తగ్గుతూ ఉండేది. ఈ వారంలో ఒక్కసారిగా కోడి మాంసం ధర 300 రూపాయలు చేరుకుంది. దీంతో గ్రామాల్లో ఉన్న ప్రజలు కోడి మాంసం కొనలేని పరిస్థితి నెలకొంది. మరోవైపు కోడి మాంసం దుకాణదారులు వ్యాపారం జరగక అంగళ్లు వెలవెలబోతున్నాయి. దీంతో తెచ్చిన కోళ్లను అమ్ముడుపోకపోవడంతో ఎండవేడిమికి చనిపోవడంతో నష్టం వాటిల్లుతుందని దుకాణదారులు వాపోతున్నారు.

ఎరువులు, విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి - బేతంచెర్ల : మండలంలోని గోరుమానుకొండ గ్రామంలోని ఆర్‌బికెలో రైతులకు మండల అగ్రికల్చర్ ఆఫీసర్ కిరణ్ కుమార్, గోరుమానుకొండ సర్పంచి కోడే వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎంపిపి బుగ్గన నాగభూషణ రెడ్డి ఎరువులు, విత్తనాలు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి నాగభూషణ్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు రుద్రవరం నారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రైతుల సంక్షేమం కోసం పెద్దపీట వేసి ప్రతి గ్రామపంచాయతీలో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - రుద్రవరం : రుద్రవరం మండలంలోని అన్ని విద్యుత్ సబ్ స్టేషన్‌లలో నేడు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ రాఘవేంద్ర రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మూడవ శనివారం సందర్భంగా మండలంలోని అన్ని సబ్ స్టేషన్‌లలో మెయింటెనెన్స్, 33 కెవి లైన్‌లో మరమ్మతులు జరుగుతుందని, రైతులకు మూడు గంటల నుండి ఉదయం 9 గంటలకు సప్లై ఇవ్వనున్నట్లు తెలిపారు. మండల విద్యుత్ వినియోగదారులు, రైతులు ప్రజలు సహకరించాలనికోరారు.

మట్టి, ఇసుక అక్రమ రవాణాను అరికట్టండి : సిపిఐ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : మహానంది మండలంలో అక్రమంగా అధికార పార్టీ నాయకులు ఎర్ర మట్టి, ఇసుకను రవాణా చేస్తున్నారని, వెంటనే జిల్లా కలెక్టర్, రెవిన్యూ అధికారులు పరిశీలించి అరికట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబా ఫకృద్దీన్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మహానంది మండలం గాజుల పల్లె, గోపవరం గ్రామాల చెరువులలోని ఇసుకను, మట్టిని అక్రమంగా రవాణా చేస్తూ లక్షలు గడుస్తున్నారని తెలిపారు. రెవెన్యూ అధికారులు కళ్ళు ఉన్న గుడ్డివాళ్లలా చూస్తూ పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. వెంటనే అక్రమ రవాణా అరికట్టకపోతే సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

కలెక్టర్‌ను కలిసిన టూరిస్టు రెస్టారెంట్ లీజుదారుడు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : కొత్తపల్లి మండలం సంగమేశ్వరం వద్ద పర్యాటక శాఖ రెస్టారెంట్‌ను లీజును వేలంలో దక్కించుకున్న సింగారం వెంకటరమణ శుక్రవారం జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. మొదటి సంవత్సరం అడ్వాన్స్ లీజు అమౌంట్ రూ. 2,57,240 డిడిని జిల్లా కలెక్టర్, జిల్లా పర్యాటక మండలి చైర్మన్‌కు అందజేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జిల్లా పర్యాటక సాంస్కృతిక శాఖ అధికారి సిహెచ్ ఎస్.సత్యనారాయణ ఉన్నారు.

పిఒడబ్ల్యు నేతలపై ఉపా కేసులు ఎత్తేయాలి : సిపిఐ

ప్రజాశక్తి - నంద్యాల : తెలంగాణ రాష్ట్రం ములుగు జిల్లా తాడ్వాయి పోలీసులు 2022 ఆగష్టు 19న పిఒడబ్ల్యూ జాతీయ కన్వీనర్ వి.సంధ్య, ప్రొఫెసర్ జీ.హరగోపాల్ తదితర 152 మంది ప్రజాసంఘాల నాయకులపై తప్పుడు పద్ధతుల్లో పెట్టిన ఉపా కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం నంద్యాలలోని ఎపిటిఎఫ్ కార్యాలయంలో డివిజన్ కార్యదర్శి ఎం.శంకర్, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు ఎస్ఎండి.రఫీ మాట్లాడారు. నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న అనేక మంది ప్రజా నాయకులను, మేధావులను అక్రమ కుట్ర కేసుల్లో ఇరికించడాన్ని ఇకనైనా మానుకోవాలని కెసిఆర్ ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు.

సిసి రోడ్ల నిర్మాణాలకు భూమి పూజ

ప్రజాశక్తి - నందికొట్కూరు : నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలోని పగిడ్యాల రోడ్డు బిఆర్ఆర్ నగర్-3, 24వ వార్డులలో సిసి రోడ్డు నిర్మాణాలకు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, వైస్ చైర్మన్ అర్షపోగు ప్రశాంతిలు శుక్రవారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నందికొట్కూరు పట్టణంలోని ప్రతి వార్డులో ఎన్నడూ లేని విధంగా శాప్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్‌లు పి.చాంద్ భాష, అల్లూరి క్రిష్ణ, అబ్దుల్ హమీద్ మియ్య, కాటేపోగు చిన్న రాజు, లాలు ప్రసాద్ వైసిపి నాయకులు బొల్లెద్దుల రామక్రిష్ణ, బోయ శేఖర్, శాలి బాషా, కురువ శ్రీను, స్వాములు, శంకర్, కాంట్రాక్టర్ వెంకటేశ్వర రెడ్డి, సడియాల ఫారుక్, బిఎస్ఆర్ టీమ్ లడ్డూ, ఎన్టీఆర్ అబ్దుల్లా, కాలనీవాసులు పెద్ద శాలిమియ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.

భూమి పూజ చేస్తున్న దృశ్యం

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం పంపిణీ

ప్రజాశక్తి - పాములపాడు : జగనన్న ఆణిముత్యాలకు పాములపాడు జడ్పిహెచ్ ప్రధానోపాధ్యాయురాలు వెంకటసుబ్బమ్మ, పేరెంట్ కమిటీ చైర్మన్ జలాల్‌సా ప్రైజ్ మనీని శుక్రవారం పంపిణీ చేశారు. మండల స్థాయిలో పదవ తరగతిలో మార్కులు సాధించిన ఎల్ లావణ్యకు రూ.3 వేలు, సయ్యద్ ఖలీద్ భాషాకు రూ.2 వేలు, టి.కళ్యాణికి వెయ్యి రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యంతో చదివి మంచి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తేవాలని వారు కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థికి నగదును అందజేస్తున్న కమిటీ చైర్మన్, హెచ్ఎంలు

మహారాజశ్రీ నందికొట్కూరు జూనియర్
సివిల్ జడ్జి గారి కోర్టులో
O.S.No. 49/2022
వీరం సాయికుమార్ రెడ్డి
(మైనర్ తరపున అతని యొక్క మేనమామ గార్డియన్
ఆర్.చంద్రశేఖర్ రెడ్డి) ... వాది
Versus
వీరం వెంకటరామిరెడ్డి మరియు ఇతరులు
.... ప్రతివాదులు
మొదటి ప్రతివాదికి దావా సమనులు
To.
వీరం వెంకటరామిరెడ్డి, S/o. వీరం పాలవెంగళరెడ్డి,
హిందు, వయస్సు 55 సం॥ వృత్తి వ్యవసాయం,
R/o. 10 బొల్లవరం గ్రామం, నందికొట్కూరు
మండలం, కర్నూలు జిల్లా. ప్రస్తుతం నంద్యాల జిల్లా.
పై కోర్టు నందు వాది తన వాటా ఆస్తి పై డిక్లరేషన్ కోరు నిమిత్తం మీ పై దావా దాఖలు చేసి యున్నాడు. సదరు దావాపై మీకు ఎటువంటి ఆక్షేపణలు ఉన్న యెడల తేది 19-06-2023న ఉదయం గం॥ 10-30 ని॥లకు మీరు స్వయముగా కాని లేదా వకీలు ద్వారా కాని హాజరు అయి ఆక్షేపణలు తెలుపుకొనచ్చును లేని యెడల మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.
(పై కోర్టు వారి ఉత్తర్వు మేరకు)
వాయిదా తేదీ : 19-06-2023
గమనిక : I.A. 123/2022, I.A. 124/2022, I.A. 125/2022 సదరు నెంబరు అర్జీలు ఈ దావాకు చెందినవి వీటి వాయిదాలు కూడా దావా వాయిదా రోజున అనగా 19-06-2023న వున్నది.
ఇట్లు
టి.రఘునాథరెడ్డి
వాది పరం న్యాయవాది,
నందికొట్కూరు.